# ప్రజాక్షేత్రం
PRAJA KSHETRAM

prajakshetram.in



అతి కొద్ది కాలంలోనే ఆదరణ పొందిన 'ప్రజాక్షేత్రం'
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని మండలాల వారీగా
నియోజకవర్గాల వారిగా, జిల్లాల వారిగా

రిపోర్టర్లు కావలెను

అనుభవం గలవారికి ప్రాధాన్యం ఇవ్వబడును

ప్రజాక్షేత్రం

కాల్ : 9177920459



సంపుటి - 01 | సంచిక : 281 | హైదరాబాద్ | గురువారం 27 - 02 - 2025 | పేజీలు - 6 | వెల.4/-


# ఐదు కీలక ప్రాజెక్టులకు నిధులివ్వండి



- మెట్రో రైల్ ఫేజ్-2కు అనుమతివ్వండి
- ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని మంజూరు చేయండి
- దానికి సమాంతర రైల్వే లైన్ అవసరం
- మూసీ ప్రాజెక్టు, డ్రైపోర్టుకు సహకరించాలి
- సెమీకండక్టర్ మిషన్‌ను ఏర్పాటు చేయాలి
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ విజ్ఞప్తులు
- వీటిని సాధిస్తే కిషన్ రెడ్డికి పౌరసన్మానం చేసి గండపెండేరం తొడుగుతానన్న రేవంత్
- ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై ప్రధానికి వివరించానన్న ముఖ్యమంత్రి

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని, ఐదు కీలక ప్రాజెక్టులకు నిధులివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్‌లో మెట్రో విస్తరణ స్తంభించిపోయిందని, ఈ ప్రాజెక్టు ముందుకు సాగడానికి తోడ్పడాలని విన్నవించారు. దీనితోపాటు రీజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగాన్ని మంజూరు చేయాలని, ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రైల్వే లైన్‌కు అనుమతించాలని, డ్రైపోర్టు నుంచి ఏపీలోని బందర్ పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మించాలని, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు భారీ నిధులు మంజూరు చేయాలని, సెమీకండక్టర్ మిషన్ ప్రాజెక్టుక అనుమతించాలని ఆయన అభ్యర్థించారు. బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయి.. వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఢిల్లీ టూర్‌లో ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎంవో అధికారి శేషాద్రి ఉన్నారు. కాగా అధికారిక సమావేశం అనంతరం మోదీతో సీఎం రేవంత్ రెడ్డి ఏకాంతంగా కొద్దిసేపు రాజకీయాలను చర్చించినట్లు సమాచారం. మోదీని కలిసిన తర్వాత రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రూపురేఖల్ని మార్చి సర్వతో ముఖాభివృద్ధికి దారితీసే ఐదు ముఖ్యమైన ప్రాజెక్టుల గురించి ప్రధానమంత్రికి వివరించానని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.



# మిస్టరీగా మరణాలు!

- రాజలింగమూర్తి, సంజీవరెడ్డి, కేదార్‌ల మరణం అనుమానాస్పదం
- ఫిర్యాదు వస్తే దర్యాప్తు చేస్తాం.. నిజాలు వెలికితీస్తాం
- ఎస్ఎల్‌బీసీ ప్రమాదానికి గత కేసీఆర్ సర్కారుదే బాధ్యత
- పదేళ్ల నిర్లక్ష్యం వల్లే టన్నెల్ మట్టి కుంగి ప్రమాదం జరిగింది
- ఫిరాయింపులపై పదేళ్ల రాజ్యాంగంలో మార్పులేమీ రాలేదు
- తెలంగాణలో ఉప ఎన్నికలు.. కేటీఆర్ అవగాహన రాహిత్యమే
- విదేశాలకు పారిపోయిన వారిని రప్పించాల్సింది కేంద్రమే
- సీబీఐ విచారణ కోరితే బీఆర్ఎస్‌ను బీజేపీ కలిపేసుకుంటుంది
- నా దృష్టి పనిపైనే.. లబ్ధిదారులే కాంగ్రెస్‌ను గెలిపిస్తారు
- బీఆర్ఎస్ కథ ముగిసింది.. భవిష్యత్తులో బీజేపీతోనే మా పోటీ
- ఆదాయాన్ని నెలకు 22 వేల కోట్లకు పెంచితేనే సరిపోతుంది
- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

# వైభవంగా ముగిసిన కుంభ మేళా



- 66 కోట్ల మందికి పైగా పుణ్య స్నానాలు
- చివరి రోజూ ప్రయాగ్‌రాజ్‌కు భక్తుల వరద
- తప్పని విషాద ఘటనలు
- రోడ్డు ప్రమాదంలో ఎంపీకి గాయాలు
- హిందూ ఓటర్లూ.. రాహుల్‌ను బహిష్కరించండి

# డీలిమిటేషన్‌తో దక్షిణాదికి దగా

- నియోజకవర్గాల పునర్విభజనతో లోక్‌సభలో
- భారీగా తగ్గనున్న ప్రాతినిధ్యం
- జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్‌తో నష్టమే
- నియోజకవర్గాల పునర్విభజనతో లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు భారీగా తగ్గనున్న ప్రాతినిధ్యం
- మరింత పెరగనున్న ఉత్తరాది రాష్ట్రాల పెత్తనం
- ఎక్కువగా లాభపడేది బీజేపీ లాంటి పార్టీలే
- దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా 33%
- పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం మాత్రం 20 శాతమే
- దక్షిణాదిలో ఎంపీ సీట్లు తగ్గవు: అమిత్ షా
- డీలిమిటేషన్‌కు జనాభా ప్రాతిపదిక వద్దు: కేటీఆర్
- పునర్విభజన ప్రక్రియలో తమిళనాడు రాష్ట్రం 8 లోక్‌సభ స్థానాలను కోల్పోతుంది : తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్



'నియోజకవర్గాల పునర్విభజన పేరిట దక్షిణాది రాష్ట్రాలపై కత్తి వేలాడుతున్నది' అని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు మద్దతు ప్రకటించారు. జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు చేసిన కృషిని పట్టించుకోకుండా, కేవలం జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడం ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. దీనిపై తాజాగా కోయంబత్తూరులో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పందించారు. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2026లో చేపట్టబోయే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు కూడా కొత్తగా లోక్‌సభ స్థానాలు దక్కుతాయని చెప్పుకొచ్చారు.

# 20 రోజుల్లోగా లైఫ్ సైన్సెస్ పాలసీ

- అన్ని వర్సిటీల్లో లైఫ్‌సైన్సెస్ కొత్త కోర్సులు
- దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో
- లైఫ్‌సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు
- ముగిసిన బయో ఏషియా-2025 సదస్సు
- 44 దేశాల నుంచి 4 వేల మంది ప్రతినిధుల హాజరు




# ప్రాణాలు పదిలమేనా?



నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలం, దోమలపెంట వద్ద శ్రీశైలం ప్రాజెక్టు జలాలపై ఆధారపడి నిర్మిస్తున్న శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్‌లో ప్రమాదం జరిగి ఐదు రోజులు కావస్తున్నా అనుకూల ఫలితాలు రాకపోవడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. గత ఐదు రోజులుగా సమీక్షలు నిర్వహిస్తూ దేశంలో ఇప్పటివరకు జరిగిన ఇలాంటి సంఘటనల్లో ప్రాణాలను కాపాడిన బృందాలను రప్పించి సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షిస్తామన్న ఆశలు పదిలంగా ఉన్నా%ొ%గురువారానికి సొరంగంలో చిక్కుకుని ఆరు రోజులు గడవడం%ొ%సొరంగంలో చిక్కుకున్న వారి ప్రాణాలు పదిలమేనా..? అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

- నిపుణుల బృందాలు వచ్చినా పురోగతి ఏదీ?
- నీటిని, బురదను తోడడానికి ఐదు రోజులా!
- సొరంగం కూలింది 13.5 కిలోమీటర్ల వద్ద..సహాయక
- బృందాలు వెళ్లింది 12 కిలోమీటర్ల లోపే?
- కన్వేయర్ బెల్టే కీలకం
- గ్యాస్..ప్లాస్మా కట్టర్లు నేడు వస్తే తొలగించడానికి ఎంత సమయం పడుతుందో?
- 5వ రోజు ఇండియా బోర్డర్ ఆర్గనైజేషన్, మార్కోస్ టీం రాక


# ఇది చిన్నపిల్లల కొట్లాట

- హిందీ భాష విషయంలో రాష్ట్ర డిఎంకె, కేంద్ర ప్రభుత్వం మధ్య వివాదం
- టీవీకే తొలి వార్షికోత్సవంలో పాల్గొన్న విజయ్
- హిందీ వివాదంపై స్పందించిన తమిళగ వెట్రి కళగం (టివికె ) అధ్యక్షుడు , నటుడు విజయ్
- నూతన విద్యావిధానం (ఎన్ఇపి), త్రిభాష సూత్రం అమలుపై రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం
- ప్రజలను తప్పుతోవ పట్టించే ప్రయత్నాలు
- గెట్‌ఔట్ హ్యాష్‌ట్యాగ్ పెట్టి వారిని సాగనంపడమే లక్షంగా కలసికట్టుగా కృషి చేద్దామంటూ ప్రజలకు పిలుపు



# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేడే

- రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానానికి..
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల దాకా
- ఉపాధ్యాయుల ఓటుకు రేటు!
- వెయ్యి నుంచి 3 వేల చొప్పున పంపిణీ!
- మూడు స్థానాలు.. 90 మంది అభ్యర్థులు
- ఒక్క ఓటరు.. ఎనిమిది మంది సిబ్బంది



రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికకు సర్వం సిద్ధమైంది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు, నల్లగొండ- వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించిన పోలింగ్ గురువారం జరగనుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. పోలింగ్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

# ఐదు కీలక ప్రాజెక్టులకు నిధులివ్వండి

ఈ ప్రాజెక్టులను మంజూరు చేయించడంతోపాటు భారీ ఎత్తున నిధులు కేటాయించేలా కేంద్ర క్యాబినెట్ మంత్రి కిషన్ రెడ్డి, సహాయమంత్రి బండి సంజయ్ తోడ్పడాలని అభ్యర్థించారు. ఈ ప్రాజెక్టులను ఆమోదింపచేస్తే ఆ ఘనత కిషన్ రెడ్డికే దక్కుతుందని, తాను ఆయనకు పౌర సన్మానం చేసి గండపెండేరం తొడుగుతానని రేవంత్ చెప్పారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–2కు వెంటనే అనుమతులు ఇవ్వాలని ప్రధానిని కోరానని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని మోదీ దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఫేజ్–2 కింద రూ. 24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన అయిదు మెట్రో కారిడార్లను ప్రతిపాదించామని వివరించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు ఆర్ఆర్ఆర్ సమీపంలో డ్రైపోర్టు అవసరమని చెప్పారు. ఆ డ్రైపోర్టు నుంచి ఏపీలోని బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు అవసరమని, ఆ రోడ్డును ఆనుకొని రైలు మార్గం మంజూరు చేస్తే సరుకుల రవాణా ఖర్చు తగ్గడంతోపాటు పారిశ్రామిక ఎగుమతి అవసరాలకు డ్రైపోర్టు కీలకంగా నిలుస్తుందని తెలిపారు. దీనివల్ల తెలంగాణలో కొత్త ఉద్యోగావకాశాలు పెరుగుతాయని చెప్పారు. హైదరాబాద్ నగరం మధ్యలో 55 కిమీ పొడవునా ప్రవహిస్తున్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని విజ్ఞప్తి చేశానన్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్ల ఆర్థిక సహాయం చేయాలని కోరినట్లు తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని విజ్ఞప్తి చేశానన్నారు. సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు తెలంగాణలో ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనమతించాలనీ ప్రధానిని కోరినట్ల రేవంత్ తెలిపారు.

**29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలి**

విభజన తర్వాత తెలంగాణకు 61 ఐపీఎస్ క్యాడర్ పోస్టులు వచ్చాయని, 2015లో రివ్యూ తర్వాత మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పుడున్న అవసరాలకు ఈ అధికారుల సంఖ్య సరిపోవడం లేదన్నారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం, రాష్ట్రంలో పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై ప్రధానికి వివరించానని తెలిపారు. నదుల పునరుజ్జీవం అవసరమని మోదీ చెప్పారని, మూసీ పునరుద్ధరణ మంచి నిర్ణయమని అభినందించారని రేవంత్ తెలిపారు.

**పెండింగ్ అంశాలను ప్రస్తావించి.. రేవంత్‌ను ఆశ్చర్యపరిచిన మోదీ**

తెలంగాణ అభివృద్ధికి ఐదు కీలక అంశాలతో ముఖ్యమంత్రి వినతిపత్రం సమర్పించిన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ.. తెలంగాణలో పెండింగ్ అంశాలపై రేవంత్‌కు నోట్ సమర్పించి ఆశ్చర్యపరిచారు. ఆయా అంశాలపై అధికారులతో చర్చించి సత్వరం చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా రేవంత్ ప్రధానితో చెప్పారు. ప్రధాని.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చిన అంశాలివి..

**పీఎంఏవై(గ్రామీణ)ను అమలు చేయడం లేదు**

2016–17లో తెలంగాణకు పీఎంఏవై కింద 70,674 ఇళ్లను మంజూరు చేసినప్పటికీ రాష్ట్రం అమలు చేయకపోగా కేంద్ర వాటా మొత్తాన్ని తిప్పిపంపింది. 2024లో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసేందుకు అనుమతించాలని కోరినప్పటికీ 2018 ఆవాస్ సర్వే జరపనందువల్ల అర్హులైన కుటుంబాలను గుర్తించలేదు. ఆవాస్–2024 మొబైల్ అప్లికేషన్ ఉపయోగించి అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించేందుకు 2025 మార్చి 31 వరకు ఇంటింటి సర్వే పూర్తి చేయాల్సి ఉంటుంది.

**మెగా ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి**

వామపక్ష తీవ్రవాద ప్రాంతాల్లో రెండవ దశలో భాగంగా మొబైల్ కనెక్టివిటీ, కొన్ని గ్రామాల్లో 4జీ మొబైల్ కవరేజి ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతోపాటు రూ. 32,797 కోట్లతో చేపట్టిన రిలయన్స్ జియో 4జీ, 5జీ విస్తరణ ప్రాజెక్టుకు అనుమతులు, అటవీ క్లియరెన్స్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. రూ. 18,189.53 కోట్లతో చేపట్టిన జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల, రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం, శ్రీరామసాగర్ ప్రాజెక్టు రెండవ దశ పనుల కోసం భూసేకరణ, న్యాయ వివాదాలు తదితర అంశాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయి. ముందుగా వీటిని పరిష్కరించుకోవాలి. బీబీనగర్‌లోని ఎయిమ్స్‌కు సంబంధించి.. రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంస్థలకు విద్యుత్ కనెక్షన్లు, నీటి సరఫరాకు సంబంధించి రూ. 1365.95 కోట్ల మేరకు నిధులు విడుదల చేయాల్సి ఉన్నది. శంషాబాద్‌లో ప్రభుత్వ భూమిని కేటాయించక పోవడం వల్ల 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం పెండింగ్‌లో ఉండిపోయింది. అదేవిధంగా భూసేకరణ, అటవీ అనుమతులు లేకపోవం వల్ల మనోహరాబాద్ – కొత్తపల్లి కొత్త రైల్వే లైన్, కాజీపేట – విజయవాడ మూడో లైన్ విద్యుద్దీకరణ పెండింగ్‌లో పడింది. ఇందుకు రూ. 3113.48 కోట్లు ఖర్చు పెట్టేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నది.

# డీలిమిటేషన్‌తో దక్షిణాదికి దగా

ఈ క్రమంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వల్ల ఎవరికి లాభం చేకూరనున్నది? ఏ రాష్ట్రాలకు నష్టం కలుగనున్నదన్న చర్చ పెద్దయెత్తున జరుగుతున్నది.

పొంచి ఉన్న నష్టం

అమిత్ షా తాజా వ్యాఖ్యలను బట్టి 2026లోనే 'జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన విధానం' (డీలిమిటేషన్) ప్రక్రియ ఉండనున్నది. దీంతో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగనున్నట్టు మేధావులు చెప్తున్నారు. జనాభా నియంత్రణలో గత కొన్నేండ్లుగా క్రమశిక్షణతో ముందుకు సాగుతున్న దక్షిణాది రాష్ట్రాలకు ఇప్పుడు ఆ క్రమశిక్షణే పెద్ద 'రాజకీయ శిక్ష'గా మారనున్నట్టు పేర్కొంటు న్నారు. జనాభా నియంత్రణ అమలును గాలికొది లేసిన ఉత్తరాది రాష్ట్రాలు.. ఇప్పుడు పార్లమెంట్‌లో ఆధిపత్యం చెలాయించ నున్నట్టు చెప్తున్నారు. హిందీ మాట్లాడేవారి జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ స్థానాలను గెలుచుకొనే అవకాశం ఉన్న బీజేపీ వంటి పార్టీలకు ఇది అనుకూలంగా మారనున్నది.

**ప్రాతినిధ్యానికి ప్రమాదం**

1971 జనాభా లెక్కల తర్వాత కేంద్రం జనాభా నియంత్రణ చేపట్టింది. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ పాటించగా, ఉత్తరాదిలో జనాభా విస్ఫోటనం సంభవించింది. దీంతో ఉత్తరాదిలోనూ జనాభా నియంత్రణకు ప్రయత్నించారు. ఇందులో భాగంగానే, డీలిమిటేషన్ చట్టం–2002 ప్రకారం నియోజకవర్గాల పునర్విభజనను 2026 దాకా నిలిపేశారు. కానీ ఉత్తరాదిన జనాభా నియంత్రణ లక్ష్యం నెరవేరలేదు. ఇదే సమయంలో గడువు కూడా దగ్గరికి వస్తున్నది. దీంతో 2026లో జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గాలను సవరించాలని యోచిస్తున్నారు. ఇదే జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంట్‌లో తమ ప్రాతినిధ్యాన్ని తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నది.

**బీహార్ అలా.. తెలంగాణ ఇలా..**

తెలంగాణలో 17 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. రాష్ట్ర జనాభా 4 కోట్లు. జనాభాను లోక్‌సభ సీట్లతో గణిస్తే 23 లక్షల మంది జనాభాకు ఒక ఎంపీ ఉన్నట్టు లెక్క. అదే బీహార్‌ను పరిశీలిస్తే ఆ రాష్ట్ర జనాభా 12.6 కోట్లు. లోక్‌సభ సీట్లు 40. అంటే, 32 లక్షల మంది జనాభాకు ఒక ఎంపీ ఉన్నట్టు అర్థమవుతున్నది. ప్రతి 15 లక్షల మంది ఓటర్లకు ఒక ఎంపీ సీటును కేటాయించారని అనుకొంటే.. ఈ లెక్కన బీహార్‌లోని ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎంపీ స్థానాలను సవరిస్తే ఆ రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు రెట్టింపవుతాయి. అంటే జనాభా నియంత్రణను సరిగ్గా అమలు చేయని బీహార్‌కి రాజకీయంగా ఎంతో లబ్ధి చేకూరుతుంది. జనాభా నియంత్రణను పాటించిన తెలంగాణ వంటి రాష్ట్రాలకు పార్లమెంట్‌లో బీహార్‌తో పోలిస్తే సీట్ల పెరుగుదల తక్కువగా ఉంటుంది.

జీడీపీలో వాటా ఎంత ఉన్నప్పటికీ దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా 33%. మిగతా 24 రాష్ట్రాలది 67 శాతం. దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ తర్వాత 165 లోక్‌సభ సీట్లను (20 శాతం), మిగతా రాష్ట్రాలకు 683 స్థానాలను (80 శాతం) కట్టబెట్టాలను కొంటున్నారు. ఇప్పటికే భాష, సంస్కృతి, నిధుల పంపకం, రాజకీయ ప్రాధాన్యాల విషయాల్లో ఉత్తరాదితో పోలిస్తే వివక్షకు గురవుతున్న దక్షిణాది రాష్ట్రాలకు ఢిల్లీ గద్దెనెక్కాల్సిందెవరో నిర్ణయించే అంశంలోనూ తగిన ప్రాధాన్యం దక్కని పరిస్థితి నెలకొంది. దక్షిణాది రాష్ట్రాల హక్కుల కార్యకర్తలు దీనిపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జనాభా నియంత్రణే శాపమా?**

**స్టాలిన్ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాం: కేటీఆర్**

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపాదికన నియోజక వర్గాలను పునర్విభజించాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తెలంగాణతో సహా దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా పరిణమిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తమిళనాడు సీఎం స్టాలిన్ అభిప్రాయంతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని బుధవారం ఒక ప్రకటనలో కేటీఆర్ తెలిపారు. దేశ సంక్షేమం కోసం జనాభా నియంత్రణను ఒక యజ్ఞంలా భావించి, దాన్ని విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం శిక్షించాలని చూస్తోందా అని ఆయన ప్రశ్నించారు. జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు చేసిన కృషిని పట్టించుకోకుండా, కేవలం జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడం ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. దేశ నిర్మాణంలో దక్షిణాది రాష్ట్రాలు అందించిన సహకారాన్ని ఎవరూ కాదనలేరని కేటీఆర్ పేర్కొన్నారు. '1951లో దక్షిణాది రాష్ట్రాల జనాభా వాటా 26.2 శాతం ఉంటే అది 2022 నాటికి 19.8 శాతానికి పడిపోయిందని, అదే సమయంలో ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి ఉత్తరాది రాష్ట్రాల జనాభా వాటా 39.1 శాతం నుంచి 43.2 శాతానికి పెరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ లెక్కన జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లను నిర్ణయిస్తే, ఉత్తరప్రదేశ్, బీహార్‌లకు కలిపి 222 సీట్లు వస్తాయని, అయితే ఐదు దక్షిణాది రాష్ట్రాలకు కలిపి కేవలం 165 సీట్లు మాత్రమే లభిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికవృద్ధి, మానవ అభివృద్ధి సూచికలు, జనాభా నియంత్రణ వంటి అన్ని రంగాల్లో ఉత్తరాది రాష్ట్రాల కంటే గణనీయంగా మెరుగైన పనితీరు కనబరిచాయని, అలాంటి రాష్ట్రాలను శిక్షించి, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించడం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమని ఆయన తెలిపారు. జనాభా కంటే ఆర్థిక సహకారాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ దేశ జీడీపీకి 5.2 శాతం వాటా అందిస్తోందని, దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు అపారమైన సహకారం అందిస్తున్నాయని, ఈ నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కేటీఆర్ కోరారు.

**దక్షిణాదిలో ఎంపీ సీట్లు తగ్గవు: అమిత్ షా**

కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది ప్రాంత రాజకీయ ప్రాతినిధ్యంపై ఎలాంటి ప్రభావం చూపదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పుకొచ్చారు. కోయంబత్తూరులో బుధవారం జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ 2026లో చేపట్టబోయే ఈ ప్రక్రియ ద్వారా దక్షిణాదికి అదనపు నియోజకవర్గాలు కూడా వస్తాయని చెప్పారు. ఈ విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మార్చి 5న అఖిల పక్ష సమావేశ ం ఏర్పాటు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.

# మిస్టరీగా మరణాలు!

తెలంగాణకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఇటీవల మరణించిన తీరు అనుమానాస్పదంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై పోరాడిన రాజలింగమూర్తి, ఆయన తరఫున న్యాయస్థానంలో వాదనలు వినిపించిన న్యాయవాది సంజీవరెడ్డితోపాటు డ్రగ్స్ కేసు నిందితుడు కేదార్‌ల మరణాలు మిస్టరీగా ఉన్నాయని పేర్కొన్నారు. కేదార్ ఏడాది క్రితం హైదరాబాద్‌లో ఒక డ్రగ్స్ పార్టీలో దొరికాడని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కేసు దర్యాప్తును వేగవంతం చేయగానే దుబాయ్‌లో కేదార్ మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు కేదార్ పార్ట్‌నర్ అని సీఎం ఆరోపించారు. ప్రతి విషయంలోనూ సమగ్ర దర్యాప్తు చేయాలని కోరే కేటీఆర్.. కేదార్ మృతిపై విచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. బుధవారం ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో రేవంత్‌రెడ్డి చిట్‌చాట్‌గా మాట్లాడారు. రాజలింగమూర్తి హత్య జరిగిన వెంటనే కాళేశ్వరంపై ఆయన దాఖలు చేసిన కేసును క్వాష్ చేయాలంటూ న్యాయస్థానాన్ని కోరారని, దీనిని బట్టే అసలేం జరిగిందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. మిస్టరీ మరణాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే సమగ్ర దర్యాప్తు చేస్తామన్నారు. తద్వారా నిజాలు బయటికి వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ఇక ఎల్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి గత కేసీఆర్ ప్రభుత్వమే కారణమని సీఎం రేవంత్ ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇది కేవలం రూ.5 వేల కోట్లతో (ప్రస్తుతం పెరిగిన అంచనా వ్యయంతో కలిపి) సుమారు 3.5 లక్షల ఎకరాలకు సాగునీరందించే గొప్ప ప్రాజెక్టు అని, ప్రపంచంలోనే అతిపెద్ద సాగునీటి సొరంగంతో కూడిన ప్రాజెక్టు అని చెప్పారు. ఇందులో కమీషన్లు రావనే ఉద్దేశంతోనే గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం దీనిని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. పదేళ్లపాటు ప్రాజెక్టును పట్టించుకోకపోవడంతో టన్నెల్ మట్టి కుంగి కూలిందని తెలిపారు. క్రమం తప్పకుండా పనులు కొనసాగి ఉంటే.. ప్రమాదం జరిగి ఉండేది కాదేమోనని అభిప్రాయపడ్డారు.

**కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు..**

గత కేసీఆర్ ప్రభుత్వం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టిందని సీఎం ఆరోపించారు. అతితక్కువ వ్యయంతో 3.5 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ప్రాజెక్టును కాదని, కేవలం లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తుందని రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని అన్నారు. చివరికి 50 వేల ఎకరాలకు కూడా సాగునీరు అందించలేదన్నారు. కాళేశ్వరం లేకపోయినా ఈసారి 1.50 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందని తెలిపారు. ఎప్పుడూ ఇంత దిగుమతి రాలేదన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదం అనుకోకుండా జరిగిందని, కానీ.. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడమనేది మానవ తప్పిదంతో జరిగిందని పేర్కొన్నారు. కేసీఆర్ అవినీతి, ప్రణాళికా లోపం, కమీషన్ల కోసం కక్కుర్తి పడడం, తానే మేధావిననే భ్రమతో జరిగిన ప్రమాదమని ధ్వజమెత్తారు. కేసీఆర్‌లా తాము తొందరపాటు నిర్ణయాలు తీసుకోబోమని, నిపుణుల కమిటీ నివేదికల తర్వాతే ముందుకు వెళతామని స్పష్టం చేశారు. టన్నెల్ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోందని, దేశంలోనే మొదటిసారిగా 18 సంస్థలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఎస్ఎల్‌బీసీని పూర్తిచేసి తీరతామన్నారు. ఇక రాష్ట్ర మంత్రివర్గంలో తనకంటే అనుభవజ్ఞులైన వారు ఉన్నారని, వారికి పూర్తి స్వేచ్ఛ ఉందని సీఎం అన్నారు. మంత్రివర్గ విస్తరణపై వస్తున్నవన్నీ ఊహాగానాలేనని, విస్తరణ ఉంటుందని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ విలీనానికి బీజేపీ కుట్ర..**

తెలంగాణలో గత పదేళ్లలో జరిగిన అవినీతికి సంబంధించి విచారణను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారని, అయితే దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సీబీఐ విచారణకు ఆదేశిస్తే ఆ పేరుతో బీఆర్ఎసను బీజేపీలో విలీనం చేసుకోవాలన్నది వారి ఆలోచన అని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం తదితర అన్ని అంశాల్లో చట్టపరంగా దర్యాప్తు జరుగుతోందని, ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని హైకోర్టు సుమోటోగా స్వీకరించి పర్యవేక్షిస్తోందని అన్నారు. హైకోర్టు కంటే సీబీఐ పెద్దదా? అని ప్రశ్నించారు. హరీశ్ రావును అరెస్టు చేయొద్దంటూ హైకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. కాళేశ్వరం అవినీతిపై జస్టిస్ ఘోష్ కమిషన్ దర్యాప్తు చేస్తోందని, కమిషన్ నివేదిక ఇచ్చిన తర్వాత ఏం చేయాలనే దానిపై స్పష్టత వస్తుందని తెలిపారు. ట్యాపింగ్ కేసు నిందితుడు ప్రభాకర్‌రావు విదేశాల్లో ఉన్నాడని, ఆయనను తీసుకురావాల్సిన బాధ్యత కేంద్రానిదేనని అన్నారు. అలాగే, ఫార్ములా–ఈ కారు రేసు కేసులో ఈడీ దర్యాప్తు జరుపుతోందని, మరి కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. ఈడీ దర్యాప్తుపై కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడడం లేదన్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ అంశం కేంద్ర క్యాబినెట్‌లో చర్చకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని, కేసీఆర్ కూడా అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు.

**రాజ్యాంగంలో మార్పులేమీ రాలేదు..**

దేశంలో పార్టీ ఫిరాయింపులకు సంబంధించి 2014 నుంచి 2024 వరకు ఏ రాజ్యాంగం అమల్లో ఉందో, ఇప్పుడు కూడా అదే రాజ్యాంగం అమల్లో ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్ ఏ పార్టీలో గెలిచి, ఏ మంత్రివర్గంలో పనిచేశారో అందరికీ గుర్తుందన్నారు. అయినా, పార్టీ ఫిరాయింపులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని మొట్టమొదటిసారి సుప్రీంకోర్టును ఆశ్రయించింది తానేనని గుర్తు చేశారు. 90 రోజుల్లో స్పీకర్ నిర్ణయం చెప్పాలని సుప్రీంకోర్టు తొలిసారిగా ఆదేశించిందని తెలిపారు. ఆ తీర్పు ఆధారంగానే ఆ తర్వాత అనేక మంది ఫిరాయింపులపై పిటిషన్లు దాఖలు చేశారన్నారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ 90 రోజుల్లో స్పీకర్ నిర్ణయాన్ని చెప్పలేదన్నారు. ఒక పార్టీలో 1/3 వంతు మరో పార్టీలో కలిస్తే అది విలీనమైనట్లు అని, చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ అన్ని రకాలుగా చట్టబద్ధంగా కాంగ్రెస్‌లో విలీనమైందని చెప్పారు. అంతే తప్ప.. ఎమ్మెల్యేల్లో 1/3 మరో పార్టీలో చేరితే అది విలీనం కిందికి రాదన్నారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్, బీజేపీ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గోవా, మణిపూర్ తదితర రాష్ట్రాల్లో బీజేపీ వ్యవహరించిన తీరు దేశమంతా చూసిందన్నారు. త్వరలోనే తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయనడం కేటీఆర్ అవగాహన రాహిత్యానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ కథ ముగిసిందని, భవిష్యత్తులో బీజేపీతోనే తమకు పోటీ ఉంటుందని చెప్పారు.

**నా దృష్టి పనిపైనే.. ప్రచారంపై కాదు..**

సోషల్ మీడియా ప్రచారంలో కాంగ్రెస్ వెనక పడుతోందన్న ప్రశ్నకు రేవంత్ బదులిస్తూ.. తన దృష్టంతా పనిపైనే ఉంటుందని, ప్రచారంపై కాదని అన్నారు. మూడేళ్ల ప్రజా సంక్షేమం, అభివృద్ధికే సమయం కేటాయిస్తానని తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ చేయలేని ఎన్నో పనులను తాము ఏడాదిలోనే చేసి చూపించామన్నారు. లబ్ధిదారులే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న ఐఏఎస్, ఐపీఎసలతోనే పని చేయించుకోవాలి తప్ప కొత్తవారిని ఎక్కడి నుంచి తీసుకొస్తామని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాకు తగినవాళ్లు రాష్ట్రంలో నలుగురే ఉన్నారని, ఉన్న అధికారులతోనే సమర్థంగా పని చేయిస్తున్నామని అన్నారు సమష్టి కృషితో రాష్ట్రాన్ని అన్నింటా అగ్రగామిగా నిలుపుతున్నామని చెప్పారు. ఏడాదిలోనే రాష్ట్రంలో నిరుద్యోగిత రేటు 8.5% నుంచి 6.6 శాతానికి తగ్గిందన్నారు. ఆక్యుపెన్సీలో హైదరాబాద్ బెంగళూరును దాటేసి దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు.

**కొడంగల్ ఇన్‌చార్జి మా సోదరుడే..**

కాంగ్రెస్ కొడంగల్ ఇన్‌చార్జి తన సోదరుడేనని సీఎం రేవంత్ అన్నారు. ఎన్నో ఏళ్లుగా అక్కడ రాజకీయ వ్యవహారాలు ఆయనే చూసుకుంటున్నారని తెలిపారు. సెక్రటేరియట్‌లో కూర్చుని అధికారులతో రివ్యూలు చేస్తే తప్పు కానీ, నియోజకవర్గంలో ప్రజల తరఫున నిలబడితే తప్పేముందని ప్రశ్నించారు. కేటీఆర్ కొడుకు భద్రాచలం వెళ్లి సీతారాములకు తలంబ్రాలు సమర్పించారని, కేటీఆర్ కొడుకు ఏ హోదాలో అక్కడికి వెళ్లాడని ప్రశ్నించారు. తన సోదరుడు అలాంటి పనులేమీ చెయ్యడం లేదన్నారు. వర్గీకరణపై అసెంబ్లీలో బిల్లు పెడతామని, దీనికోసం అన్నీ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గతంలో హుజూరాబాద్‌లో 1.5 శాతం ఓట్లే వస్తే తనదే బాధ్యత అని చెప్పానని, ఆ తర్వాత అదే హుజూరాబాద్‌లో 40 శాతం ఓట్లు వచ్చాయని గుర్తు చేశారు. ఐదేళ్ల తర్వాత దేనికైనా బాధ్యత తనదేనన్నారు. కులగణన విషయంలోనూ అన్నింటికీ తానే బాధ్యత వహిస్తానని, కాంగ్రెస్ అధిష్ఠానం చెప్పిన దారిలోనే తాను ముందుకు వెళతున్నానని స్పష్టం చేశారు.

**నిధుల కేటాయింపులో కేంద్రం వివక్ష సరికాదు...**

దేశంలోని రాష్ట్రాలకు నిధుల కేటాయింపుల విషయంలో కేంద్రం వివక్ష చూపడం సరికాదని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కేంద్రానికి తెలంగాణ రూపాయి చెల్లిస్తే కేంద్ర మాత్రం కేవలం 42 పైసలే తిరిగి ఇస్తుందన్నారు. అలాకాకుండా, 50శాతం నిధులు జనాభా ప్రాతిపదికన, మరో 50 శాతం నిధులు కేంద్రానికి రాష్ట్రం చెల్లిస్తున్న పన్నుల ప్రాతిపదికన కేటాయించాలని కోరారు. ఇటీవలే హైదరాబాద్‌లో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమావేశంలో సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశామన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందించే ప్రక్రియను చేపట్టామని, త్వరలోనే ప్రతి కార్డుదారుకు సన్నబియ్యం అందిస్తామని అన్నారు.

**ప్రతి నెలా 6,500 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నాం..**

గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రతినెలా రూ. 6,500 కోట్ల వడ్డీలు చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ప్రతినెలా రాష్ట్రానికి సుమారు రూ. 18,500 కోట్ల ఆదాయం వస్తుందని, అందులో వడ్డీలు, వేతనాలకే రూ. 13 వేల కోట్ల దాకా చెల్లిస్తున్నామని అన్నారు. మిగిలిన సొమ్ముతోనే సంక్షేమం, అభివృద్ధి అన్నీ చేయాల్సి వస్తోందన్నారు. ఆదాయాన్ని రూ. 22 వేల కోట్లకు పెంచితే అన్నింటికీ సజావుగా సరిపెట్టే వీలుంటుందని, అందుకే.. పెంచే పనిలో పడ్డామని చెప్పారు. పన్నుల శాఖలో సంస్కరణలు చేశామని, దీనివల్ల జీఎస్టీ రాబడిలో సుమారు 8 శాతం వృద్ధిని నమోదు చేశామని వెల్లడించారు. మైనింగ్ రంగాన్ని కూడా గాడిలో పెట్టామని, ఇసుక తరలింపులో అక్రమాలకు తావులేకుండా చేశామని తెలిపారు. కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టే ఉద్దేశం లేదని, దశలవారీగా పెండింగ్ బిల్లులు చెల్లిస్తున్నామని అన్నారు. ఇక హైదరాబాద్‌లో ఆక్రమణలను పూర్తిగా అరికట్టామని, హైడ్రా తర్వాత ఆక్రమణలు జరగలేదని చెప్పారు. చెరువుల ఆక్రమణ అంటేనే వెన్నులో వణుకు పుట్టించే పరిస్థితిని తీసుకొచ్చామని తెలిపారు. బీజేపీ నేతలు హైడ్రా పేరుతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు చంద్రబాబునాయుడి హయాంలో నందనవనం లాగే ఏదైనా చేస్తే బాగుంటుందనే ఆలోచన ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తనను కలవడానికి వచ్చిన తనకు తెలియదన్నారు. కేసీఆర్ లాగా నిర్బంధ పాలన లేదన్నారు.

# వైభవంగా ముగిసిన కుంభ మేళా

కోట్లాది మంది భక్తుల విశ్వాసం, అఖాడాల ఆశీర్వాదాలతో హిందువులు పవిత్రంగా భావించే ప్రయాగ్‌రాజ్ మహా కుంభ మేళా శివరాత్రి పర్వదినమైన బుధవారం వైభవంగా ముగిసింది. ప్రజల భక్తి, ఐక్యత, సామరస్యాల సంగమంగా నిలిచిన ఈ వేడుకకు త్రివేణి సంగమం సాక్షిగా నిలిచింది. జనవరి 13న ప్రారంభమై 45 రోజుల పాటు జరిగిన ఈ మేళాలో 66.21 కోట్ల మందికి పైగా పాల్గొని పుణ్య స్నానాలు చేయగా, ఆఖరి రోజు1.44 కోట్ల మందికి పైగా భక్తులు హాజరైనట్టు అంచనా. ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా ఇది రికార్డులకెక్కింది. దేశ, విదేశీ ప్రముఖులు ఈ కుంభమేళాలో పవిత్ర స్నానాలు చేశారు. ఈ కుంభమేళాకు ప్రత్యక్షంగా హాజరు కాని భక్తులకు డిజిటల్ ఫొటో స్నానం చేయించడం విశేషం.

**తప్పని విషాద ఘటనలు**

ఈ మహా ఉత్సవంలో కొన్ని విషాద ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. జనవరి 29న మౌని అమావాస్య నాడు జరిగిన తొక్కిసలాటలో 30 మంది మరణించగా, 60 మంది గాయపడ్డారు. వివిధ ప్రదేశాలలో కుంభ మేళాకు వస్తున్న, వెళ్తున్న భక్తులు రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. కుంభమేళా జరుగుతున్న ప్రదేశంలో మూడు నాలుగుసార్లు అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కుంభమేళాకు వచ్చే దారులన్నీ కిలో మీటర్ల మేర తరచూ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయాయి. ఐఐటీ బాబా, కబూతర్ వాలా బాబా, పూసలమ్ముకునే మోనాలిసా లాంటి వారు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం పొందారు.

**రోడ్డు ప్రమాదంలో ఎంపీకి గాయాలు**

కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తున్న జార?ండ్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ మహువా మాజీ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం తెల్లవారుజామున 2.30 గంటకు వారి కారు జార?ండ్‌లోని హోట్‌వగ్ గ్రామం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రక్కును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎంపీతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి.

**144 ఏండ్లకు కుంభమేళానా.. వాస్తవమెంత?**

మహా కుంభమేళా 144 ఏండ్లకు ఒకసారి వస్తుందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవమెంత ఉందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రశ్నించారు. ఇటీవల కుంభమేళాలో జరుగుతున్న ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేసిన ఆమె 144 ఏండ్లకు ఒకసారి మహా కుంభమేళా జరుగుతుందని వేసిన అంచనాను ప్రశ్నించారు. మతా బెనర్జీ వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని బీజేపీ విమర్శించింది.

**హిందూ ఓటర్లూ.. రాహుల్‌ను బహిష్కరించండి**

ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు విచ్చేసిన హిందూ మహా ఉత్సవం మహా కుంభ మేళాను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రే సందర్శించకుండా హిందువులను అవమానించారని కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే విమర్శించారు. వీరిని హిందూ ఓటర్లు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కోట్లాది హిందువుల మనోభావాలను గౌరవించి రాహుల్, ఠాక్రే కుటుంబాలు ఇందులో పాల్గొనాలని, కాని వారు దానికి గైర్హాజరై హిందువులను అవమానపరిచారని విమర్శించారు.

# 20 రోజుల్లోగా లైఫ్ సైన్సెస్ పాలసీ

బయో ఏషియా–2025 సదస్సుకు ప్రభుత్వం ఊహించిన దాని కంటే అధిక స్పందన వచ్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బయో ఏషియా చరిత్రలో ఈ ఏడాది సదస్సు ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 44 దేశాల నుంచి 4 వేల మంది ఫార్మా, హెల్త్‌కేర్ పరిశ్రమ లీడర్లు, విధానకర్తలు, ఆవిష్కర్తలు హాజరయ్యారని తెలిపారు. హెచ్‌ఐసీసీలో బుధవారం బయో ఏషియా–2025 ముగింపు సదస్సులో, అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు. దేశంలోనే తొలిసారి లైఫ్ సైన్సెస్ పాలసీని తేవడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టిందన్నారు. ఫార్మా రంగంలో కంపెనీలు మరిన్ని పెట్టుబడులు పెట్టేలా, ఈ రంగంలో రాష్ట్ర యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో దీన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. దీనిపై త్వరలోనే క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామని, 20 రోజుల్లోగా కొత్త విధానాన్ని ప్రకటిస్తామన్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నామని, దీన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలోని అపార అవకాశాలు రాష్ట్ర యువతకు దక్కేలా అన్ని వర్సిటీల్లో కొత్త కోర్సులు అమలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ అంశంపై త్వరలో అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతుల (వీసీ)తో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఫార్మా రంగంలో తెలంగాణలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు కంపెనీలు ఆసక్తితో ఉన్నాయని, కాలుష్య లేని విధంగా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. వికారాబాద్, జహీరాబాద్‌లో ఇప్పటికే స్థలాలను గుర్తించామని, లగచర్లలో ఫార్మా పరిశ్రమలుకాకుండా పర్యావరణహిత పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారని మంత్రి పేర్కొన్నారు. ఇక హెల్త్, ఫార్మా రంగాలకు చెందిన 100మంది నిపుణులు ఆయా రంగాల్లో సవాళ్లను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన అంశాలపై బయోఏషియాలో చర్చించారని, ఈ సదస్సులో 200కుపైగా బిజినెస్ టూ బిజినెస్ సమావేశాలు జరిగాయని మంత్రి తెలిపారు. గతేడాది కంటే ఈసారి ఎక్కువ పెట్టుబడులు వచ్చాయన్నారు. అమెరికాకు చెందిన బయో టెక్నాలజీ దిగ్గజం అమ్జెన్ భారీ పెట్టుబడులతో 3వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ ఏడాది సదస్సులో 84 స్టార్టప్స్ పాల్గొన్నాయన్నారు. సంబంధిత రంగంలో అనుభవమున్న 4 పరిశ్రమల సహకారంతో 'సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ' పేరిట ప్రత్యేక కోర్సును ప్రారంభించామని, మొదటి బ్యాచ్‌లో 140మంది విద్యార్థులు శిక్షణను పూర్తి చేసుకున్నారని మంత్రి తెలిపారు. జీనోమ్ వ్యాలీలో వ్యాక్సిన్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని గతంలో ప్రధాని మోదీ హామీ ఇచ్చార న్నారు. ఈ కేంద్రం ఏర్పాటయ్యేలా సహకరించాలని సదస్సు వేదికపై ఉన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఉద్దేశిస్తూ మంత్రి పేర్కొన్నారు.

**లైఫ్‌సైన్సెస్‌లో తెలంగాణ అద్భుతం: పీయూష్**

లైఫ్‌సైన్సెస్, ఫార్మా రంగాల్లో తెలంగాణ అద్భుతమైన విజయాలను సాధిస్తోందని, రాష్ట్రం ప్రముఖ హెల్త్‌కేర్ హబ్‌గా నిరూపించుకుందని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించారు. బయో ఏషియా ముగింపు సదస్సులో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. దేశంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్లు, బయోటెక్ పరిశోధనా కేంద్రాలను తెలంగాణ నిర్వహిస్తోందని కొనియాడారు. ఈ రంగంలో తెలంగాణ విజయాలు.. భారత అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, జహీరాబాద్‌లోని ఇండస్ట్రియల్ నోడ్‌తోపాటు బీబీనగర్ ఎయిమ్స్‌తో తెలంగాణ ప్రయోజనం పొందుతోందని తెలిపారు.

**ఫార్మాలో హైదరాబాద్ కీలకం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

భారత ఫార్మా రంగంలో హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. దేశంలోని ఫార్మా ఆదాయంలో 35శాతం, బల్క్ డ్రగ్స్‌లో 40శాతం ఆదాయం ఇక్కడి నుంచే వస్తోందన్నారు. 800 ఫార్మా, బయోటెక్, మెడిటెక్ కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయన్నారు. బయో ఏషియా ముగింపు సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌లో ఐఐటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ (నైపర్), సీసీఎంబీ, ఐఎసబీ, నల్సార్, డీఆర్‌డీవో వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి నైపుణ్యం కలిగిన యువకులు ఆయా రంగాల్లో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, ఫార్మాసిటీ, మెడికల్ డివైజెస్ పార్కు వంటివి విదేశీ పెట్టుబడులను ఆకర్షించి, 2047నాటికి 500 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఎకానమీ సృష్టి దిశగా అడుగులు వేసే అవకాశాలు హైదరాబాద్‌లో మెండుగా ఉన్నాయన్నారు. లైఫ్‌సైన్సెస్ రంగానికి ఊతమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందువరుసలో ఉంటుందని తెలిపారు. కేంద్రం తెచ్చిన 'మెడ్‌టెక్ మిత్ర' వంటి వేదికలు.. ఆవిష్కర్తలు, స్టార్టప్స్, భాగస్వామ్య పక్షాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేందుకు దోహదపడుతున్నాయని చెప్పారు. 'రానున్న రెండేళ్లలో భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, 2030నాటికి 7 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ 'బల్క్ డ్రగ్ క్యాపిటల్', 'వ్యాక్సిన్ క్యాపిటల్'గా పురోగతి సాధించిందన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో వినూత్న ఆవిష్కర్తలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు బహుమతులు ప్రదానం చేశారు.

# ప్రాణాలు పదిలమేనా?

సొరంగం బయట రక్షణ బృందాలు వందల సంఖ్యలో చేరుకున్నా సొరంగంలో చిక్కుకున్న 8 మంది వరకు చేరుకోకపోవడమే అనేక ప్రశ్నలకు తావిస్తోంది. సొరంగాల నిర్మాణ రంగంలో ప్రపంచంలోనే భారతదేశం కూడా భారీ సొరంగ నిర్మాణాలు చేపడుతూ అధునాతన టెక్నాలజీని వినియోగించుకోవడమే కాకుండా ప్రపంచ నాణ్యత ప్రమాణాలతో కూడిన యంత్రాలను సమకూర్చుకున్న సమయంలో కూడా ఎస్ఎల్‌బిసిలో చిక్కుకున్న వారిని రక్షించడంలో జరుగుతున్న ఆలస్యంపైనే సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు చర్యలు ఆలస్యం అవుతుండడంతో సొరంగంలో చిక్కుకుని ఉన్న 8 మంది ప్రాణాలు పదిలంగా ఉన్నాయా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమై అనుమానాలకు ఆజ్యం పోస్తోంది.

**రక్షణ బృందాలు ఎక్కువ..చర్యలు తక్కువ**

ఎస్ఎల్‌బిసి సొరంగంలో జరిగిన దుర్ఘటనలో రక్షణ చర్యలు చేపట్టడానికి వచ్చిన బృందాలు అధికంగా ఉండడం చర్యలు తక్కువగా ఉండడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క బృందం ఒక విధంగా రక్షణ చర్యలు చేపట్టడానికి సూచనలు చేస్తూ యంత్రాలు, ఇతర పరికరాలను సమకూర్చాలని అధికారులను కోరుతుండడం, అవన్నీ రప్పించిన సొరంగ మార్గం ద్వారా ఘటన స్థలం వద్దకు తీసుకుని వెళ్లడం సాధ్యం కాకపోవడమే ఆలస్యానికి మరో కారణంగా చెప్పవచ్చు. టన్నెల్ బోరింగ్ మెషీన్ వెనుక భాగంలో భారీ ఇనుముతో కూడిన స్ట్రక్చర్‌లు ఉండడం, అవి సొరంగం కూలిన ఘటనలో భారీ బండరాళ్లు పడడంతో చిందరవందరగా ఉన్నట్లు అక్కడి వరకు వెళ్లిన సహాయక బృందాలు చెబుతున్న దాన్ని బట్టి చూస్తే అర్థమవుతోంది. ఆర్మీ, నేవీ బృందాలు, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, ర్యాట్ హెూల్ మైనర్స్, సింగరేణి బృందాలకు తోడు తాజాగా బుధవారం మైనింగ్ రెస్క్యూ సిబ్బంది, ఇండియా బోర్డర్స్ ఆర్గనైజేషన్, ఇండియా మారెన్ కమాండో బృందాలు దోమలపెంట వద్దకు చేరుకున్నాయి. పరిస్థితులకు అనుగుణంగా వారి వారి అనుభవం అవసరాలకు అనుగుణంగా యంత్రాలు, ఇతర పరికరాలను సమకూర్చాలని చెప్పడం, వాటిని రప్పించడమే ప్రధానంగా ఆలస్యానికి కారణంగా భావిస్తున్నారు.

**గ్యాస్, ప్లాస్మా కట్టర్లు రాక**

సొరంగంలో మట్టిదిబ్బలు, బండ రాళ్లు కూలి 8 మంది చిక్కుకోవడమే కాకుండా బోరింగ్ మెషీన్‌కు అనుసంధానంగా ఉన్న భారీ ఇనుము వ్యర్థాలను తొలగించడమే లక్షంగా 5వ రోజు అధునాతన గ్యాస్, ప్లాస్మా కట్టర్లను రప్పించినట్లు మంత్రులు నిర్వహించిన సమీక్షా సమావేశంలో తెలిపారు. తాజాగా వీరి సేవలు వినియోగించుకోవడం ద్వారానైనా ఘటనా స్థలం వద్దకు చేరుకుంటారా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. వారు సొరంగంలోకి వెళ్లి అక్కడి పరిస్థితులను అంచాన వేసిన తర్వాతే పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా నీటి ఊట, బురద పేరుకుపోవడం వల్లే పనులు జరగడానికి ఆలస్యం అవుతుందని చెబుతున్నారే తప్ప 13 కిలోమీటర్ల దూరం నుంచి దానిని తొలగించడానికి అదనంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ఘటనకు ముందు సహజంగా నిర్మాణం కోసం వినియోగించే ఒకే ఒక వైపు ద్వారా ఊరుతున్న నీటిని బురదను విడతల వారీగా బయటకు పంపించేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

నీటి ఊట వస్తున్న దానికి అనుగుణంగా ఔట్ పుట్ లేదని అందుకే బురద సొరంగంలో యధావిధిగా ఉందని తెలుస్తోంది. సొరంగంలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించకుంటే రక్షణ చర్యలకు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకపక్క నీటి ఊటను బయటకు పంపుతూ మరోపక్క సొరంగం కూలిన ఘటనలో పూర్తిగా దెబ్బతిన్న కన్వేయర్ బెల్ట్, ఆక్సిజన్, గాలి, నీరు వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పూర్తి చేయడమే పెను సవాల్‌గా మారిందని చెప్పవచ్చు. ఒక్కో పనికి ఒక బృందం తప్ప మరో బృందం సొరంగంలోకి వెళ్లే పరిస్థితులు లేవు. బురద నీటి వ్యర్థాలను తొలగించడానికి కన్వేయర్ బెల్ట్ కీలకం కావడం, దానికి మరింత ఆలస్యం జరుగుతుండడం సర్వత్రా ఉత్కంఠకు దారితీస్తోంది. లోపలికి వెళ్లడానికి లోకో ట్రైన్ తప్ప మరో మార్గం లేకపోవడం, ఒకసారి లోకో ట్రైన్ లోపలికి వెళ్లి బయటకు రావడానికి 40 నిమిషాలు పడుతోందని నిపుణులు చెబుతున్నారు.

# ఇది చిన్నపిల్లల కొట్లాట

భాష పేరుతో తమిళనాట డీఎంకే ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కపట నాటకాలాడుతున్నాయని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత, సినీ హీరో విజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను మోసగించడానికి ఎల్కేజీ విద్యార్థుల్లా కొట్లాడుకుంటున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియాలో ఒకరికొకరు హ్యాష్‌ట్యాగ్‌లు వేసుకుని ఆటలాడుతున్నారని ధ్వజమెత్తారు. మహాబలిపురంలోని ఓ స్టార్ హెూటల్‌లో బుధవారం జరిగిన టీవీకే పార్టీ ద్వితీయ వార్షికోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రానికి అవసరాల మేరకు నిధులివ్వడం కేంద్రం బాధ్యత అని, కేంద్రం నుంచి నిధులు రాబట్టడం రాష్ట్ర ప్రభుత్వం విధి అని చెప్పారు. అయితే ఇటీవల విద్యా సంబంధిత నిధుల వ్యవహారంలో డీఎంకే, బీజేపీ ప్రభుత్వాలు తాయిలాల కోసం కొట్లాడుకునే చిన్న పిల్లల్లా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఆ రెండు పార్టీల నాటకాలు ప్రజలకు తెలిసిందేనన్నారు. 'వాట్ బ్రో... ఇట్స్ రాంగ్ బ్రో' అంటూ సినీ స్టయిల్‌లో చెణుకులు విసిరారు. అన్ని భాషలను గౌరవించాల్సిందేనని, అదే సమయంలో ఓ భాషను నిర్బంధంగా అమలు చేయాలని కేంద్రం ప్రయత్నించడం సమాఖ్య రాజ్యాంగ విధానానికి వ్యతిరేకమన్నారు. విద్యా విధానాలను అయోమయంలో ఉంచి, ఓ భాషను నెత్తికెత్తుకుని నిర్బంధంగా అమలు చేయడం ఏమిటి అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో మూడో భాషను అమలు చేయడానికి ప్రయత్నిస్తే తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో పెత్తందార్లను ఇంటికి సాగనంపడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ విజయ ఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**అవినీతిని అంతమొందించాలి: ప్రశాంత్ కిశోర్**

టీవీకే వేడుకల్లో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ పాల్గొని మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనంత అవినీతి ప్రస్తుతం తమిళనాడులో ఉందన్నారు. అవినీతిపరులను అంతమొందించాలని, ఈ సత్కార్యాన్ని విజయ్ నెరవేరుస్తారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా విజయ్ గెలుస్తాడని, దానికి అవసరమైన అండదండలను తాను అందిస్తానని భరోసా ఇచ్చారు. విజయ్ పార్టీకి తాను వ్యూహకర్తగా పనిచేయడం లేదని, కానీ తమిళనాడులో కొత్త మార్పు కోసం ఆయనకు అండగా నిలిచానని వివరించారు. నాలుగేళ్ల క్రితమే తాను ఎన్నికల వ్యూహకర్త పని నుంచి వైదొలిగానని పేర్కొన్నారు. చివరగా డీఎంకేకు రాజకీయ సలహాదారుగా వ్యవహరించానని గుర్తుచేశారు. విజయ్ పార్టీ అధికారంలోకి వచ్చేలోగా తాను తమిళం నేర్చుకుని ప్రసంగించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు.

**'గెట్ అవుట్' పేరుతో సంతకాల ఉద్యమం**

కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని, రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దింపే లక్ష్యంతో 'గెట్ అవుట్' పేరుతో ఈ వేడుకల్లో సంతకాల ఉద్యమాన్ని విజయ్ ప్రారంభించారు. సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన 'గెట్ అవుట్' బ్యానర్‌పై విజయ్ తొలి సంతకం చేశారు. ఆ తర్వాత పార్టీ ప్రముఖులు సంతకాలు చేశారు. అయితే ప్రశాంత్ కిశోర్ మాత్రం ఆ బ్యానర్‌పై సంతకం చేయడానికి నిరాకరించడం చర్చనీయాంశమైంది.

# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేడే

బ్యాలెట్ పత్రాలు, బాక్సులు, ఇతర పోలింగ్ సామగ్రితో పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు బుధవారమే చేరుకున్నారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలో 3,55,159 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 27,088 మంది ఓటర్లు ఉన్నారు. పట్టభద్రులు ఓటు వేసేందుకు 499, ఉపాధ్యాయులకు 274 కలిపి మొత్తం 773 కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులోని 93 కామన్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. మరోపక్క, నల్లగొండ–వరంగల్– ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో మొత్తం 25,797 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ నియోజకవర్గం 12 జిల్లాల్లోని 191 మండలాల్లో విస్తరించగా మొత్తం 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, ఓటింగ్ నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

**మూడు స్థానాలు.. 90 మంది అభ్యర్థులు**

రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల కలిపి మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో మొత్తం 90 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి సి.అంజిరెడ్డి, బీఎస్పీ అ?భ్యర్థి ప్రసన్న హరికృష్ణ, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్ సహా 56 మంది బరిలో ఉన్నారు. ఇదే జిల్లాలకు చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, జాక్టో అభ్యర్థి ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి సహా 15 మంది పోటీ చేస్తున్నారు. ఇక, నల్లగొండ –వరంగల్–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 19 మంది పోటీ పడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి (టీఎసయూటీఎఫ్), పింగళి శ్రీపాల్‌రెడ్డి (పీఆర్‌టీయూటీఎస్), గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి (టీపీఆర్‌టీయూ), పులి సర్వోత్తంరెడ్డి (బీజేపీ), పూల రవీందర్ (మాజీ ఎమ్మెల్సీ, బీసీ జేఏసీ), సుందర్‌రాజ్‌యాదవ్, మరో 13మంది పోటీలో నిలిచారు.

**ఒక్క ఓటరు.. ఎనిమిది మంది సిబ్బంది**

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో ఒకే ఒక ఓటరు కోసం ఓ పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. ఎన్నికల విధులకు ఎనిమిది మంది సిబ్బందిని కూడా కేటాయించారు. పలిమెల మండలంలో పదికి పైగా ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. పంకెన గ్రా మంలో మాత్రమే ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలకు చెందిన ఒకేఒక్క ఉపాధ్యాయుడు ఓటరుగా నమోదయ్యారు. ఆ ఉపాధ్యాయుడి కోసం పలిమెలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా.. ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు ఐదుగురు పోలింగ్ సిబ్బంది, ఒక రూట్ ఆఫీసరు, ఇద్దరు పోలీసులు బుధవారం సాయంత్రమే అక్కడికి చేరుకున్నారు. అయితే, ఆ ఉపాధ్యాయుడు ఓటు హక్కును వినియోగించుకుంటారో? లేదో ? చూడాలి మరి..!!

# ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో గ్రామాల అభివృద్ధి.

**పెద్దేముల్ ఫిబ్రవరి 26 (ప్రజాక్షేత్రం):**

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయని కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పెద్దేముల్ మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో "ఎన్ఆర్ఈజిఎస్ కింద రూ. 4లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను జనహృదయనేత, పేదల పక్షపాతి.. సాయిని నారాయన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఖానాపూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే సహకారంతో, దశలవారీగా నిధులను కేటాయించి.. మిగతా పెండింగ్ పనులను, అసంపూర్తిగా ఉన్న వివిధ పనులను త్వరలోనే పూర్తి చేయడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు పి. మైపాల్ రెడ్డి, ఖానాపూర్ గోపాల్ రెడ్డి, కోహీర్ రవి, విద్యాసాగర్, లక్ష్మారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మహాశివరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే

**- బషీరాబాద్ మండలంలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు.**

**- భారీగా తరలివచ్చిన భక్తులు, జన సమూహం.**

**బషీరాబాద్ ఫిబ్రవరి 26 (ప్రజా క్షేత్రం)**

బషీరాబాద్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రలు అయిన శ్రీ ఏకాంబరేశ్వర స్వామి, జీవన్గి మహాదేవ లింగేశ్వర స్వామి, నవండ్గి శ్రీ కూడాలి లింగేశ్వర దేవాలయాల్లో శివరాత్రి మహెూత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...దైవం సర్వంతర్యామి మనిషి ప్రతి కదలికలో దైవం ఉంటుందని,ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, భక్తి మార్గంలో నడవాలని,భగవంతుని ఆశీస్సులతో అందరూ చల్లగా ఉండాలని, మంచి చేసే వారికి ఆ భగవంతుడు ఎప్పుడూ మంచి చేస్తాడని తెలిపారు.



అదేవిధంగా ఈ సంవత్సరం పుష్కలంగా వర్షాలు పడి, రైతుల సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రం

గురువారం 27 - 02 - 2025

# పదవి కోసం కాదు ప్రజల కోసం పనిచేసే నాయకుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి.

- ప్రగతి కోసం ప్రజల పక్షాన నిలబడే నిస్వార్థ సేవకుడు కొండ.
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్ కుమార్.
- ఘనంగా కొండ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు.
- ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సహాక చెక్కులు పంపిణీ



**తాండూరు ఫిబ్రవరి 26 (ప్రజాక్షేత్రం):** బీజేపీ చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పదవి కోసం కాదు ప్రజల కోసం పనిచేసే నాయకుడు అని.. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్ కుమార్ అన్నారు. బుధవారం తాండూరులో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు యు.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపీ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రిలో రోగులకు, బంధువులకు అల్పాహారం వితరణ చేశారు.అదేవిధంగా పట్టణంలోని గంజ్ అసోసియేషన్ హాల్ లో కేక్ కట్ చేసి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జస్టిస్ కొండా మాధవ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సహకంగా నగదు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా యు.రమేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి నిస్వార్థ సేవకుడు అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛత ట్రక్కులను ఏర్పాటు చేసి మూత్రశాలలు పరిశుభ్రం చేయిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు తోడ్పాటు అందిస్తున్నారని. కోట్ పల్లి ప్రాజెక్టులో బోట్లు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారని అన్నారు. వారి కుటుంబం అంతా ప్రజా సేవలో ఉందని, అదే మార్గంలో ముందుకు సాగుతున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి మరింత ఉన్నతంగా ఎదగాలని, ఆరోగ్యంగా ఉండాలనని ఆకాంక్షించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు నాగారం నర్సింలు, సీనీయర్ నాయకులు గాజుల శాంతుకుమార్, బాలి శివకుమార్, మాజీ కౌన్సిలర్ సాహు శ్రీలత, మోత్కుపల్లి చంద్రశేఖర్, పూజారి పాండు, మల్లేశ్ యాదవ్, మంతటి రాజు, దోమ కృష్ణ, చిత్ర ప్రకాష్, సంగమేశ్వర్, రాంచెందర్, ప్రభాకర్ గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ మణికంఠ రియల్ ఎస్టేట్స్ నూతన ఆఫీసును ప్రారంభించిన భీమ్ భారత్



**మొయినాబాద్ ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** మండలం అజీజ్ నగర్ లోని పద్మావతి కాలనీ లో దిష్యంత్, మల్లేష్ శ్రీ మణికంఠ రియల్ ఎస్టేట్స్ నూతన ఆఫీసు ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీమ్ భరత్ మరియు వీరితో పాటుగా పాల్గొన్న మండల అధ్యక్షులు మాణయ్య, వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, విఠల్, అజీజ్ నగర్ గ్రామ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, శ్రీశైలం, మాణిక్ రెడ్డి, నరేందర్ గౌడ్, శ్రీ పాల్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వరుడి సేవలో బుల్లితెర నటుడు సుధాకర్



**శంకర్ పల్లి ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** శంకర్ పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో చాళుక్య రాజులు వెయ్యి ఏళ్ల క్రితం స్థాపించిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వరుడి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుల్లితెర నటుడు (బ్రహ్మముడి, సీతే రాముడి కట్నం, సీరియల్స్) సుధాకర్ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాయిశివ నటుడికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు హనుమంతు, లీలావతి నటుడుని స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

# ఎస్సీ వర్గీకరణలో రిజర్వేషన్ల కేటాయింపులు శాస్త్రీయంగా చేయాలి.

- మార్చి 1 న ఓయూలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ.
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ.



**హైదరాబాద్ ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న ఎస్సీ వర్గీకరణ చట్టంలో అన్ని కులాలకు రిజర్వేషన్ల కేటాయింపులు శాస్త్రీయంగా జరిగేలా చూడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఓయూ గెస్ట్ హౌస్ లో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ అత్యవసర సమావేశానికి ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గోవిందు నరేష్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ మీద నియమితులైన జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏక సభ్య కమిషన్ సమర్పించిన నివేదిక లోపభూయిష్టంగా ఉ ందని అన్నారు. వివిధ కులాలను గ్రూప్ లలో చేర్చే అంశంలో మరియు వివిధ గ్రూప్ లకు రిజర్వేషన్లు కేటాయించే విషయంలో నిర్దిష్టమైన ప్రామాణిక సూత్రాలను పాటించలేదని అన్నారు. అందువల్లనే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన ఈ ఎస్సీ వర్గీకరణ మీద ఎస్సీలలో ఉన్న ఏ కులం కూడా సంతృప్తిగా లేదని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించాలని అన్నారు. గ్రూప్ – 1 లో ఉన్న మన్నె, పంబాల కులాలను గ్రూప్ – 3 లో చేర్చాలని డిమాండ్ చేశారు. గ్రూప్ – 2 లో ఉన్న మాదిగలకు న్యాయబద్ధంగా రిజర్వేషన్లు కేటాయించడంలో కమిషన్ వివక్షతను చూపెట్టిందని అన్నారు. అత్యధిక జనాభా కలిగి ఉన్న మాదిగలకు 9% రిజర్వేషన్లు కేటాయించడం అన్యాయమని అన్నారు. జనాభా ప్రాతిపదికన చూస్తే 12% రావాలని లేదా కమిషన్ నియమ నిబంధనలు పాటించినా 11% రిజర్వేషన్ వస్తాయని అన్నారు. కానీ మాల కులానికి లాభం చేకూర్చడం కోసమే కమిషన్ మరియు రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయతను, హేతుబద్ధతను పాటించలేదని అన్నారు. ఇప్పటికైనా ఈ లోపాలను, పొరపాట్లను సవరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలకు న్యాయం జరిగేలా ఎస్సీ వర్గీకరణను చేపట్టాలని డిమాండ్ చేస్తూ భవిష్యత్ ఉద్యమ ప్రయాణంలో ముందుకు సాగుదామని అన్నారు.అందులో భాగంగా ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన మాదిగ అమర వీరుల సంస్మరణ సభను మార్చి 1న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కలశాలలో నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ హాజరు కానున్నారని తెలిపారు. కావున మాదిగ విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ,ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బోర్ర బిక్షపతి మాదిగ, ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ,జాతీయ కార్యదర్శి డా. పల్లెర్ల సుధాకర్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామరపు శ్రీనివాస్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనీల్ మాదిగ ఎంఎస్ఎఫ్ సీనియర్ నాయకులు యేడవెల్లి అజయ్ మాదిగ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జన్నపాల మహేష్ మాదిగ,ఉపాధ్యక్షులు ఈదుల రాజీవ్ ప్రదీప్ మాదిగ,సంక్షేమ హాస్టళ్ల ఇన్చార్జి మంద అనీల్ మాదిగ, సైఫాబాద్ పీజీ కాలేజి నాయకుడు బన్నీ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు క్రీడా సామాగ్రి అందజేత




**రాజన్న సిరిసిల్ల ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపురం గ్రామంలో టీ షర్ట్స్ మరియు క్రికెట్ కిట్టును క్రీడాకారులకు ప్రధానం చేసిన కేతిరెడ్డి నవీన్ కుమార్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక మానసిక ఉత్తేజాన్ని ఇస్తుందని గ్రామంలోని యువత క్రీడల వైపు వచ్చి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని అదేవిధంగా గ్రామానికి కూడా గుర్తింపు ఇవ్వాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా ముక్యంగా యువత చెడు వ్యాసనాలకు బానిసకాకుండా డ్రగ్స్ ను యువత ఎంత దూరంగా ఉంటే వారి ఉజ్వల భవిష్యత్తును కాపాడుకొని ఒక సన్మాన మార్గంలో పయనిచాలని కోరారు. క్రికెట్ కిట్టును అందజేసిన నవీన్ కుమార్ ను క్రీడాకారులందరు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గన్నేరం నర్సయ్య, మీసరగండ్ల అనిల్ కుమార్, ఎల్లవేణి రమేష్, ల్యాగల భాగయ్య, మధుసూదన్ రెడ్డి, పయ్యావుల కనుకయ్య, అమ్ముల అశోక్ మరియు క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శైవ క్షేత్రాలలో ఆర్జేసి కృష్ణ ప్రత్యేక పూజలు



**ఖమ్మం,ఫిబ్రవరి 26 (ప్రజాక్షేత్రం):** స్థానిక ట్రంక్ రోడ్ ప్రాంతం లోని స్వయంభూ గు%శీ%టు మల్లేశ్వర స్వామి,తెల్దారు పల్లిశైవ క్షేత్రం ల లో బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామి వారికి కృష్ణ దంపతులు,కూతురు డా.జి.ధాత్రి విశేష అభిషేకాలు నిర్వహించారు.బుధవారం వేకువ జామున ఆలయానికి వెళ్లిన వారు శివ లింగానికి అర్చన,అభిషేకాలు నిర్వహించారు.

## వల్లాపురం మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించిన తహాశీల్దార్



**ఖమ్మం,ఫిబ్రవరి 26 (ప్రజాక్షేత్రం):** ముదిగొండ మండల పరిధిలోని వల్లాపురం గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించిన ముదిగొండ మండల తహశీల్దార్ సునీతా ఎలిజబెత్ ఈ సందర్భంగా దర్శన టికెట్ల ధర ఎంత వసూలు చేస్తున్నారు,ఎంత మందిని దర్శనానికి పంపిస్తున్నారని ఆరా తీసి దర్శన టికెట్లు నిర్ణయించిన ధరకు మాత్రమే డబ్బు వసూలు చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు.అనంతరం ప్రజలతో కలిసి క్యూ లో వెళ్లి స్వామి వారిని దర్శనం చేసుకుని కానిస్టేబుల్ సిబ్బందితో కలిసి భద్రతా సంరక్షణ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలతో మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటూ గుడికి వచ్చిన ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు.

# ‘బుగ్గ’లో ‘బాయిజమ్మ’ వారి అన్నదానం

-పండ్లు మరియు తాగునీటి పంపిణీ

-బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ

-ఆనందం వ్యక్తం చేసిన భక్తులు



**బెల్లంపల్లి ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి ప్రాంత ప్రసిద్ధ బుగ్గ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వద్ద బుధవారం బాయిజమ్మ సాయి సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు పిల్లి పద్మావతి ప్రభాకర్, ముదాం వెంకటేష్, కోలా గోపాల్, లక్ష్మీ మరియు ట్రస్ట్ వ్యవస్థాపకులు సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంతో పాటు అశేషంగా తరలివచ్చిన భక్తజనులకు పండ్ల పంపిణీ మరియు తాగునీటిని అందజేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేయడంతో పాటు పండ్ల పంపిణీ, తాగునీరు అందజేయడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

**ఐదేళ్లుగా సేవా కార్యక్రమాలు**

బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే రడగంబాల బస్తీ కేంద్రంగా నిర్వహిస్తున్న భాయిజమ్మ సాయి సేవా ట్రస్టు వారు ఐదు సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఏటా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుగ్గ రాజన్న క్షేత్రంలో కూడా భక్తులకు అన్నదానం మరియు పండ్లు పంపిణీ అల్పాహారం పంపిణీ తాగునీటి పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇట్లా అన్ని రకాల ఆహార అవసరాలు తీర్చుతూ వారి కృతజ్ఞతలకు పాత్రులు అవుతున్నారు.

**అన్నదానం చేద్దాం రండి**

ట్రస్ట్ ద్వారా “ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం-అన్నదానంతో తృప్తి పరుద్దాం” అని ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్-రాజేశ్వరి పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని, మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ తెలిపారు ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు, జేరిపోతుల చంద్రకళ, దుర్గం మారుతీ, డి మధుకర్ సేవకులు పోతరాజుల తిరుపతి, కాడపాక మహేందర్, బానోత్ నవీన్, కోలా గోపాలం, గీతా, అబ్బు బాకర్ సిద్దిక్, బాణోత్ హేమంత్ మెరుగు ఇందు, ఉరడి శివ ,మరియు దాతలు , తదితరులు పాల్గొన్నారు. బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ద్వారా అన్నదానం, సాయం అందించాలని అనుకునేవారు ట్రస్ట్ మేనేజర్ 8106550532, ఫౌండర్స్ 9959269975, 9949041595 సంప్రదించాలని కోరారు.

## పదవ తరగతి టాపర్లకు చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఫౌండేషన్ తరపున చెక్కులు అందజేత



**శంకర్ పల్లి ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం శంకర్ పల్లి మండల కేంద్రంలోని అతిధి గృహంలో స్థానిక బిజెపి నాయకులు మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం సమక్షంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం మండల, మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి టాపర్ లకు విశ్వేశ్వర్ రెడ్డి ఫౌండేషన్ తరపున వారు విద్యార్థులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు వాసుదేవ్ కన్నా, మున్సిపల్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, నాయకులు పాండు, రాములు, వీరేందర్, లోకేష్, ప్రవీణ్, వెంకట్, ఆంజనేయులు, వెంకటరామిరెడ్డి, హరి గౌడ్, కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన ఎలక్షన్ సెక్టార్ ఆఫీసర్ ఖమ్మం జిల్లా టూరిజం ఆఫీసర్ బి.సుమన్ చక్రవర్తి, ముదిగొండ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తహాశీల్దార్ సునీతా ఎలిజబెత్



**ఖమ్మం,ఫిబ్రవరి 26 (ప్రజాక్షేత్రం):** ఫిబ్రవరి 27న తెలంగాణలో గ్రాడ్యుయేట్,టీచర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే 7 ఉమ్మడి జిల్లాల్లో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి అయితే ముదిగొండ మండలంలో పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది ఎన్నికల సంఘం.ఈ సందర్భంగా ఎలక్షన్ సెక్టార్ ఆఫీసర్ ఖమ్మం జిల్లా టూరిజం ఆఫీసర్ బి.సుమన్ చక్రవర్తి, ముదిగొండ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తహాశీల్దార్ సునీతా ఎలిజబెత్ తో కలిసి పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ క్యామ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తామని అన్నారు విద్యావంతులైన ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.వారి వెంట ఎలక్షన్ పీఓ టీ.శ్రీనివాస్, పోలింగ్ ఆఫీసర్ 1 సయ్యద్ రఫీ ఉద్దీన్,పోలింగ్ ఆఫీసర్ 2 షేక్ యాకూబ్ పాషా,పోలింగ్ ఆఫీసర్ 3 బి. సక్రు, ఎమ్ఓ బీ రతన్ రాజ్ తదితరులు ఉన్నారు.

# ఈనెల 28న జరిగే బీసీ రౌండ్ టేబుల్ సమావేశం జయప్రదం చేయండి...

**- మహాదేవుని జగదీష్ బీసీ హక్కుల సాధన సమితి నర్సంపేట పట్టణ కన్వీనర్...**



**నర్సంపేట,ఫిబ్రవరి 26 (ప్రజాక్షేత్రం):**
దేశంలో జరగబోయే జనాభా లెక్కలతో పాటు కుల జనగణన కూడా చేయాలనీ, దామాషా ప్రకారం చట్టసభల్లోనూ,విద్యా వైద్యం ఉపాధి రంగాల్లో ఎవరి వాటా వారికి ఇవ్వాలనే అంశాలపై ఈనెల 28 న హైదరాబాద్ హిమాయత్ నగర్ మగ్దూం భవన్ లోని రాజ్ బహదూర్ గౌర్ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు, బీసీల హక్కులు,రిజర్వేషన్లకు మద్దతుగా ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఎంఎల్ఏ ప్రారంభిస్తారనీ ఆకారపు మోహన్,.తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.ఇటీవల రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన కులగణనలో 3.1% ప్రజలు పాల్గొనకపోవడం వలన ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు నమోదు చేసుకొనే అవకాశం కల్పించినందున నమోదు కాని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కుల జన గణన ప్రకారం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు,విద్యా ఉద్యోగ అవకాశాలు కల్పించాలనీ డిమాండ్ చేశారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెప్పుతున్న విధంగా బీసీల రిజర్వేషన్ల చట్టం చేసి కేంద్రానికి పంపిన యెడల కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలనీ,కేంద్ర ప్రభుత్వం కూడా తక్షణమే జనాభా లెక్కలతో కలిపి కుల గణన చేయాలనీ డిమాండ్ చేశారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి బీసీ హక్కుల సాధన సమితి నేతలతో పాటు,టి చిరంజీవులు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి,జాజుల శ్రీనివాస్ గౌడ్ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు,ప్రొఫెసర్ వై ప్రభంజన్ యాదవ్ ఛైర్మన్ సామాజిక న్యాయ జేఏసీ,దాసు సురేష్ బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు,బొమ్మ గాని ప్రభాకర్ ఐఏఎల్ జాతీయ ప్రధానకార్యదర్శి,మేకపోతుల నరేందర్ గౌడ్ బీసీ సంక్షేమ సంఘం,టి ఆర్ చందర్ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, బీసీ టైమ్స్ సూర్యారావు అధ్యక్షులు బీసీ సమాజ్,బత్తుల సిద్దేశ్వర్ బీసీ ఆజాదీ,దేవుళ్ళ సమ్మయ్య రాష్ట్ర బ్యాంక్ వర్డ్ క్లాస్ ఫెడరేషన్ ఛైర్మన్,సమగ్రమైన బీసీల ఎజెండా రూపొందించుకోవడానికి కావలసిన కార్యాచరణ కోసం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు,బీసీ సంఘాలు, నేతలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి.

# ఎమ్మెల్సీ పోలింగ్ విధులను పకడ్బందీగా చేపట్టాలి:అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి

**-ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్**

**ఖమ్మం,ఫిబ్రవరి 26 (ప్రజాక్షేత్రం):**
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులను సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్ల సంఖ్య ఆధారంగా అవసరమైన సామాగ్రిని పోలింగ్ సిబ్బందికి అప్పజెప్పాలని సూచించారు. పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతూ,ఒకటికి రెండు సార్లు పోలింగ్ సామగ్రి సరిచూసుకొని తీసుకొని వెళ్ళాలని,ఎన్నికల నియమ, నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ పోలింగ్ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం ఖమ్మం జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, మొత్తం 4089 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు.ఎన్నికలు సజావుగా జరిగేందుకు 9 సెక్టార్ అధికారులు,28 ప్రిసైడింగ్ అధికారులు,27 అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులు,58 ఇతర పోలింగ్ సిబ్బంది,28 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు,8 రూట్లలో పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది,సామాగ్రిని తరలిస్తున్నామని,వీటి కోసం 8 ఆర్టీసీ బస్సులను సన్నద్ధం చేశామని అన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన చల్లని నీరు,క్యూలైన్ల వద్ద టెంట్, ఇతర సౌకర్యాలు కల్పించామని,జిల్లాలోనీ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట



భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు.ఉపాధ్యాయ ఓటర్లందరూ తప్పనిసరిగా ఫిబ్రవరి 27న జరిగే పోలింగ్ లో పాల్గొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చి, వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ పిలుపు నిచ్చారు.జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని అదనపు కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని,ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించు కోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.పోలింగ్ సామాగ్రితో ఎన్నికల విధుల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి తరలివెళ్లి, పోలింగ్ కేంద్రంలో గురువారం నాటి పోలింగ్ కు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సహాయ రిటర్నింగ్ అధికారిణి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ఎన్. అరుణ,ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైరా నియోజకవర్గ ప్రజలకు మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు:ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**ఖమ్మం,ఫిబ్రవరి 26 (ప్రజాక్షేత్రం):**
స్నానాల లక్ష్మీపురం,పల్లిపాడు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ మరియు ఆలయ పండితులు పూర్ణకుంభంతో శాసనసభ్యులు మాలో రామదాసు నాయక్ సతీమణి లలితకు స్వాగతం పలికారు. పల్లిపాడు గ్రామం నందు కొలువైదిరిన స్వయంభు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం,వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు శివపార్వతులను కుటుంబ సమేతంగా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్–లలిత మరియు కుమారుడు విఘ్నేష్ నాయక్. దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ భక్తులకు ఏర్పాటుచేసిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. శాసనసభ్యులు రాందాస్ నాయక్ మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, ఖమ్మం జిల్లా ప్రజలకు మరియు వైరా నియోజకవర్గ ప్రజలకు మహా శివరాత్రి పర్వదిన శివపార్వతుల కళ్యాణ మహోత్సవ కార్యక్రమంకు విచ్చేయుచున్న భక్తులకు ప్రత్యేకమైన శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్.సతీమణి పువ్వాళ్ళ ఇందుమతి, మండల పార్టీ అధ్యక్షులు శీలం వెంకట



నర్సిరెడ్డి,బొర్రా రాజశేఖర్,మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, యడ్లపల్లి వీరయ్య చౌదరి, రాంపుడి రోశయ్య, దొడ్డ పుల్లయ్య,పల్లిపాడు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ తాటిపెల్లి లలిత శ్రీనివాస,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య,బోళ్ళ గంగారావు, వైరా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పమ్మి అశోక్,వైరా మాజీ జెడ్పిటిసి నంబూరి కనకదుర్గ పాల్గొన్నారు...

# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మంత్రి కావాలని రాచకొండ హజ్రత్ గాలిఫ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన

**-మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు యండి.రహీం షరీఫ్**
**-సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్**

**నారాయణపురం,ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):**
సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ హజ్రత్ గాలిప్ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా మునుగోడు నియోజకవర్గం ఎమ్మెల్యే రాజా గోపాల్ రెడ్డి మంత్రి కావాలని కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గం మైనార్టీ నాయకుడు యండి. రహీం షరీఫ్,ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో హజ్రత్ గాలిఫ్ దర్గాలో దట్టి కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాచకొండ ప్రాంతం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలి అంటే అది మన డైనమిక్ మునుగోడు నియోజకవర్గం ఎమ్మెల్యే రాజా గోపాల్ రెడ్డి కే సాధ్యం అవుతుంది అన్నారు. హైదారాబాద్ నగరానికి కుత వేటు దూరంలో అన్న రాచకొండ ప్రాంతన్ని గత పాలకులు అభివృద్ధి చేయక పోవటం సిగ్గు చేటు అన్నారు గత బి అర్ ఎస్ పార్టీ ప్రభుత్వం పేరుకే రాచకొండ కమిషనరేట్ అని నామకరణ చేశారు తప్ప ఇప్పటి వరకు రాచకొండ ప్రాంతం ఎలాంటి అభివృద్ధికి నోచు కోలేదు అన్నారు



రాచకొండ ప్రాంతం రైతులకుప్రజలకు న్యాయం జరగాలి రాచకొండ ప్రాంతం ఒక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందాలి అంటే ఎమ్మెల్యే రాజా గోపాల్ రెడ్డి కి మంత్రి పదవి రావాలి అప్పుడే పూర్తి స్థాయిలో రాచకొండ ప్రాంతం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుంది అన్నారు. మీడియా ద్వారా కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నాం ప్రజల మనిషి ఇక డైనమిక్ ఎమ్మెల్యే రాజా గోపాల్ రెడ్డి కి మంత్రి పదవి ఇవ్వాలి.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు కావాలి బుగ్గ రాములు ముదిరాజ్,సంస్థాన్ నారాయణపురం మండల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బైకని నరేందర్ యాదవ్, ఆరుట్ల గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల ,బాషా మైనార్టీ నాయకుడు యండి ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# గుంతలమయంగా మారిన గొల్లగూడెం రోడ్డుకు మరమ్మతులు చేయించిన సుర్వి రాజుగౌడ్

**నారాయణపురం,ఫి బ్రవరి 26(ప్రజాక్షేత్రం):**



అల్లందేవిచెర్వు గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడెం, నాగవారిగూడెం గ్రామాలకు బీటీ రోడ్డు వేయాలని అనేకసార్లు ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిదులకు వినతి పత్రాలు ఇచ్చినా,ఆ రోడ్లను పట్టించుకున్న నాథుడే లేడు.నేడు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గొల్లగూడెం గ్రామంలో జరిగే శ్రీ రామలింగేశ్వర స్వామి జాతరకు వచ్చే భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా పూర్తిగా గుంతలమయంగా మారిన గొల్లగూడెం రోడ్డును మట్టి పోయించాలని ఆ గ్రామ ప్రజలు కోరిన వెంటనే టిప్పర్లతో మట్టి పోయించి రోడ్డును బీజేపీ మండల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్ గారు మరమ్మతులు చేయించారు.ఈ కార్యక్రమంలో గొల్లగూడెం బూత్ అధ్యక్షులు గోధుమగడ్డ జంగారెడ్డి, మండల నాయకులు సుర్వి లింగస్వామి గౌడ్ గోధుమగడ్డ నరేందర్ రెడ్డి,గోధుమగడ్డ మధు రెడ్డి, గోధుమగడ్డ రంజిత్ రెడ్డి,సుర్వి వెంకటేష్ గౌడ్,నరేష్ గౌడ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రం శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయం

**-మహాశివరాత్రి సందర్భంగా శివాలయానికి పోటెత్తిన భక్తులు**


**శంకర్ పల్లి ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):**




శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఎంతో ప్రాముఖ్యత పొందిన శివాలయానికి భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైఎస్సార్సీపి నాయకురాలు, యాంకర్ శ్యామల స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, యాంకర్ లకు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాలను అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రజలందరూ స్వామివారి కృపతో అష్టైశ్వర్యాలు, సుఖశాంతులతో కష్టాలన్నీ తొలగి ప్రశాంతంగా కలకాలం ఉండాలని ఆ మరకత లింగేశ్వరుడిని వేడుకున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి రోజున మరకత లింగాన్ని దర్శించుకుంటే సకాల కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకమని, అందుకే ఇతర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు మహాశివరాత్రి రోజున మరకత లింగేశ్వరుడిని దర్శించుకుంటారని అన్నారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**వలిగొండ,ఫి బ్రవరి 26 (ప్రజాక్షేత్రం):**



యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలో వేములకొండకు చెందిన కోలగాని వెంకటేశం 58 సంవత్సరములు,రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం రోజున రాత్రి రామన్నపేట మండలం లక్ష్మాపురం వెళ్లి తిరిగి వస్తుండగా,బైక్ అదుపుతప్పి మూసి వంతన పైనుండి పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

# రాష్ట్రంలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమి విజయం తథ్యం: గాజువాక టీడీపి శ్రేణులు.




**విశాఖపట్నం,ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):**
ఉత్తరాంధ్రలో జరుగుతున్న టీచర్ ఎమ్మెల్సీ స్థానాన్ని అలాగే గుంటూరు మరియు ఈస్ట్ గోదావరి గ్రాడ్యుట్స్ ఎమ్మెల్సీల ఎన్నికల్లో మేధావులు మరియు టీచర్లు విజయానికి కృషి చేస్తారని గాజువాక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు.ఈరోజు పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు మరియు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు వార్డు ఇన్చార్జిలతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 8 నెలల నారా చంద్రబాబునాయుడు మరియు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వము ఈ రాష్ట్రంలో ప్రజా రంజకమైన పరిపాలన సాగిస్తుందని అన్నారు నరేంద్ర మోడీ సహకారంతో దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ మరియు ప్రధానమైన సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం రాజులను కృషి చేసింది అన్నారు.

# పోస్ట్ మెన్ యాదిరెడ్డికి నివాళులర్పించిన సిపిఎం నాయకులు



**వలిగొండ,ఫిబ్రవరి 26 (ప్రజాక్షేత్రం):**
యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని గోపరాజు పల్లి గ్రామంలో ఉత్తమ సేవలు అందించిన పోస్ట్ మెన్ కోమటిరెడ్డి యాద్ రెడ్డి మృతి చెందడంతో,సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గాజుల ఆంజనేయులు,సిపిఎం శాఖ కార్యదర్శి ఏనుగుల నరసింహ,మాజీ ఉపసర్పంచ్ సంఘ పాక బిక్షపతి,సిపిఎం నాయకులు గాజుల మల్లేశం, జనసేన పార్టీ నాయకులు మేడి కుమార్ పాల్గొన్నారు.


# సుంకిశాలలో ఎండిపోయిన పంటలను పరిశీలించిన సిపిఎం నాయకులు



**వలిగొండ,ఫిబ్రవరి 26 (ప్రజాక్షేత్రం):**
యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని సుంకిశాల గ్రామంలో భూగర్భ జలాలు అడగంటి పోయి ఎండిపోయిన పంట పొలాలను సిపిఎం నాయకులు సిర్పంగి స్వామి పరిశీలించారు.పంట ఎండిపోయిన రైతులకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి స్వామి డిమాండ్ చేశారు.సుంకిశాల గ్రామంలో 20 మంది రైతుల పంట పొలాలు ఎండిపోయాయని వెంటనే సర్వే నిర్వహించి రైతులను ఆదుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య,మంగ బాలయ్య,ఉప్పలయ్య,బాల నరసింహ,మొగిలిపాక కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## సర్వేల్ గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం మరియు ప్రాచీన శివాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ చైర్మన్





**సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా,సంస్థ నారాయణపురం మండల పరిధిలోని సర్వేల్ గ్రామపంచాయతీలో గల శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మరియు ప్రాచీన శివాలయంలో శ్రీ మహా శివరాత్రి సందర్భంగా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ గుత్తా శేఖర్ రెడ్డి – కల్పన దంపతులు మరియు ప్రాచీన శివాలయల అధ్యక్షులు వర్ధన్ రవి యాదవ్ – శైలజ దంపతులు కలిసి స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారుఈ కార్యక్రమంలో మాజీ దేవస్థానం చైర్మన్ వెల్లంకి చంద్రయ్య గౌడ్,మాజీ సర్పంచ్ మానుపాడు సతీష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సుక్క స్వామి,బోయ నరసింహ అనేకమంది భక్తులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా రాచకొండలోని స్వయంభు శంభు లింగేశ్వర స్వామి మహాశివరాత్రి వేడుకలు





**సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా,సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని రాచకొండలో వెలసిన స్వయంభు శంభు లింగేశ్వర స్వామివారికి మహాశివరాత్రి పర్వదినాన ఘనంగా శివరాత్రి మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ శివరాత్రి పర్వదినాన అనేకమంది భక్తులు పాల్గొనడం జరిగింది. ఈరోజు మహాశివరాత్రి కావడం వలన ఈ రాచకొండలో స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి శివలింగం దగ్గరనే కాకుండా, హజరత్ గాలి దర్గా ఉర్సు ఉత్సవాలు కూడా ప్రతి సంవత్సరం మహాశివరాత్రి రోజున ప్రారంభమవుతాయి. పది సంవత్సరం ఈ యొక్క మహాశివరాత్రి పర్వదినం రోజున అనేకమంది భక్తులు శంభు లింగేశ్వర స్వామి దేవస్థానం దగ్గర పూజలు నిర్వహించుకుని అటు నుండి దర్గా దగ్గర కూడా పూజలు నిర్వహిస్తుంటారు. ఇది అనాదిగా వస్తున్న సంస్థాన్ నారాయణపురం మండలంలోని గొప్ప వేడుకలు. ఈ యొక్క జాతరకు సంస్థాన్ నారాయణపురం గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జక్కిడి చంద్రారెడ్డి, మెట్రో ఉదయం నారాయణపురం మండలం విలేకర్ వెంకటాచారి, నారాయణపురం మండలం మాదిగ జర్నలిస్టుల ఫోరం సహాయ కార్యదర్శి బోయ అనిల్ కుమార్ పాల్గొని స్వయంభూ శంభు లింగేశ్వర స్వామికి క్షీరాభిషేకం మరియు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శరత్ కుమార్ శాస్త్రి వాళ్ళను ఘనంగా సన్మానించారు.

## కూసుమంచిలో పూజలు నిర్వహించిన ఎంపీ వద్దిరాజు



**ఖమ్మం,ఫిబ్రవరి 26 (ప్రజాక్షేత్రం):** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర-విజయలక్ష్మి పుణ్య దంపతులు ఖమ్మం జిల్లా కూసుమంచి గణపేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర-విజయలక్ష్మి దంపతులు కొబ్బరికాయలు కొట్టి శివపార్వతులకు భక్తి ప్రపత్తులు,గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వారికి జ్ఞాపికలు అందజేసి, కండువాలతో గౌరవించారు. తీర్థ ప్రసాదాలిచ్చి,ఆశీర్వచనాలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర వెంట యూత్ లీడర్స్ సుంకర చిరంజీవి, ఆకుల సాయి,మద్దెల భానుప్రతాప్ తదితరులు ఉన్నారు.

## బీచ్ రోడ్ లో కోటి శివలింగాలకు మహా కుంభాభిషేకం

**-సింహగిరి పైన త్రిపురాంతకస్వామి ఆలయంలో గంట్ల దంపతులు ప్రత్యేక పూజలు.**

**-అప్పన్న దర్శనం అపురూపం.**



**సింహాచలం,ఫిబ్రవరి, 26(ప్రజాక్షేత్రం):** మహాశివరాత్రి పర్వదినము సందర్భంగా విశాఖ ఆర్కే బీచ్ లో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ టి. సుబ్బారామి రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కోటి శివలింగాలకు మహా కుంభాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులే నేరుగా ఈ శివలింగాలకు అభిషేకం చేసుకున్నారు. సుబ్బ రామి రెడ్డి భక్తులు కు పసుపు తాళ్ళ అందచేసారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు దంపతులు కోటి శివలింగాలకు మహా అభిషేకం గావించారు. సుబ్బ రామి రెడ్డి వీరితో అభిషేకం చేయించారు. అనంతరం సింహగిరి పైన అప్పన్న క్షేత్రపాలకులు త్రిపురాంతక స్వామి ఆలయంలో కూడా గంట్ల శ్రీను బాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినము సందర్భంగా సింహాద్రినాధుని వీరు దర్శించుకున్నారు.

## బిజెపి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**-జస్టిస్ కొండా మాధవ రెడ్డి ఫౌండేషన్ ద్వార ప్రాథమిక పాఠశాల లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత.**



**మొయినాబాద్,ఫిబ్రవరి 26 (ప్రజాక్షేత్రం):** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిదిలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన సంధర్భంగా యెన్కేపల్లి గ్రామం ప్రాథమిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2024 సంవత్సరం పదవ తరగతిలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన యెన్కేపల్లి అనుబంధ గ్రామమైన జీవాన్ గూడ గ్రామ వాస్తవ్యులు వడ్డె మోహన్ తండ్రి వడ్డె శ్రీరాములు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన సందర్భంగా జస్టిస్ కొండా మాదవ రెడ్డి ఫౌండేషన్ ద్వార వడ్డె మోహన్ కి 2500/- రెండు వేల ఐదు వందల రూపాయల బహుమతికి ఎంపికైనందుకు యెన్కేపల్లి మరియు జీవాన్ గూడ గ్రామస్తుల తరపున ముదిగొండ ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ జీవితంలో ఎన్నో విజయాలు సాధించి తను ఉన్నత శిఖరాలను అదిరోహించాలని మనస్ఫూర్తిగ కోరుకుంటూ తన ఉన్నత చదువు కొరకు ఎల్లవేల నేను తొడుంటానని యెన్కేపల్లి గ్రామ బిజెపి పార్టీ అద్యక్షులు ముదిగొండ ప్రభాకర్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.యస్.రత్నం మాజీ శాసన సభ్యులు,కంజార్ల ప్రకాష్ చేవెళ్ల నియోజక వర్గం బిజెపి పార్టీ ఇంచార్జ్, ప్రభాకర్ రెడ్డి శ్రీరామ్ నగర్ గ్రామ మాజీ సర్పంచ్, రెడ్డి పల్లి మధు సుదన్ రెడ్డి మాజీ మండల అద్యక్షులు, మొయినాబాద్ మండల బిజెపి అధ్యక్షులు మాదాపురం శ్రీకాంత్,ముదిగొండ ప్రభాకర్ యాదవ్ యెన్కేపల్లి గ్రామ బిజెపి పార్టీ అధ్యక్షులు, బాకారం వెంకటేష్ గౌడ్, నాగిరెడ్డి గూడ జ్ఞానేశ్వర్ రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పాల్గొన్నారు.

## నన్ను ఎవరూ అరెస్ట్ చేయలేదు.. ఇక్కడే ఉన్నా: పైలెట్ రోహిత్ రెడ్డి



**ప్రజాక్షేత్రం వెబ్ డెస్క్:** తనను దుబాయిలో అరెస్ట్ చేశారని ప్రచారం జరుగుతోందని, అందులో ఏ మాత్రం వాస్తవం లేదని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. తాను హైదరాబాద్ మణికొండలోని తన నివాసంలో ఉన్నానని ఆయన తెలిపారు. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారం నమ్మవద్దన్నారు. కొందరు కావాలనే ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాండూరు ప్రజలు చింతించాల్సిన అవసరం లేదన్నారు. తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని చెప్పారు. తాండూరు ప్రజానికి, స్నేహితులు, కార్యకర్తలకు మరోసారి శివరాత్రి శుభాకాంక్షలు చెతున్నానంటూ పైలట్ రోహిత్ రెడ్డి వీడియో విడుదల చేశారు.

## పట్నం మహేందర్ మెడికల్ కాలేజీ లో పేద ప్రజలకు సేవా చేస్తున్నా డాక్టర్ రాహుల్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** ప్రభుత్వ ఆస్పత్రిలో కన్నా చేవెళ్ల పరిధిలోని డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఆసుపత్రిలో మెరుగైన వైద్యం పేదలకు, అందుతుందని ,చాతి వైద్య నిపుణులు డాక్టర్ రాహుల్ రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం ప్రజాక్షేత్రం విలేకరితో మాట్లాడుతూ, కార్పొరేట్ ఆసుపత్రిలో వారికి రాత్రి పగలు, కష్టపడి మెరుగైన సేవలు అందిస్తున్నామని డాక్టర్ రాహుల్ రెడ్డి అన్నారు. చేవెళ్ల లోని డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ఆఫ్ మెడికల్ సైన్స్, ఆస్పత్రికి, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్ పల్లి, షాబాద్, వికారాబాద్ జిల్లా పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు, పట్నం మహేందర్ రెడ్డి, ఆస్పత్రికి వైద్య, నిమిత్తం తరలి వస్తున్నారని, అటువంటి రోగులకు వైద్య, సిబ్బంది కష్టపడి వైద్యం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు,

**డాక్టర్ రాహుల్ రెడ్డి విద్యాభ్యాసం**

డాక్టర్ రాహుల్ రెడ్డి ఒకటవ తరగతి నుండి, దేవశాల, పదకో పదవ తరగతి వరకు అనగా 2004 వరకు అక్కడ విద్యను అభ్యసించానని, చెప్పారు, అదేవిధంగా ఇంటర్మీడియట్ అకాడమీ, ఎస్సార్ నగర్, 2004 నుండి 2006 వరకు పూర్తి చేశారని చెప్పారు, ఇక ఎంబిబిఎస్ మమత మెడికల్ కాలేజ్ ఖమ్మం, 2007 నుండి, 2013 వరకు పూర్తి చేశారని ఆయన అన్నారు, ఇక, ఎండి ఛాతి వైద్య నిపుణులుగా సంగారెడ్డి లో, 2017 నుండి 2018 వరకు పూర్తి చేశారని పేర్కొన్నారు. ఇక సీనియర్ రెసిడెన్సి 2018 నుండి, 2019 ఉస్మానియా, ఎర్రగడ్డ,



చాతి, వైద్య నిపుణులుగాఆసుపత్రిలో విధులు నిర్వహించాలని పేర్కొన్నారు,

ఛాతి వైద్య నిపుణులు డాక్టర్ రాహుల్ రెడ్డి చేస్తున్నటువంటి చికిత్సలు. చేవెళ్ల పట్నం మహేందర్ రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఆసుపత్రిలో చాతి, వైద్యులుగా విధులు, నిర్వహిస్తున్నప్పటికీ, ప్రస్తుతం పేద ప్రజలకు, అందుబాటులో ఉన్న చికిత్సలు, ఊపిరితిత్తుల్లో నీరు తీయడం, చాతునొప్పి, చాతిలో మంట, గురక, దగ్గు, దమ్ము,, టీ బి, హెచ్ఐవి, కరోనా, అస్తమా, పొగాకు సంబంధించిన వ్యాధుల గూర్చి, పట్నం మహేందర్ రెడ్డి మారుమూల గ్రామాల ప్రజలకు చికిత్సలు చేస్తున్నట్లు వీటిని పేద ప్రజలు వినియోగించుకోవాలని కోరుతున్నారు. ఆయన ప్రస్తుతం పట్ట మహేందర్ రెడ్డి ఇనిస్టట్ఆఫ్ మెడికల్ సైన్స్ ఛాతి వైద్యుల విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ రాహుల్ రెడ్డి చేసే చికిత్సలను పేద నిరుపేద ప్రజలు, వినియోగించుకోవాలని ఆయన గ్రామాల్లోని పేద ప్రజలను కోరుతున్నారు.

## మహాశివరాత్రి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**ఖమ్మం,ఫిబ్రవరి 26 (ప్రజాక్షేత్రం)** :రాష్ట్ర ప్రజలు సుబీక్షంగా ఉండాలని, ప్రపంచం లో తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా వారంతా క్షేమం గా ఉండాలని ఆ శివపార్వతులను వేడు కున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన శ్రీమతి మల్లు నందినితో కలిసి స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురం లోని పురాతన శివాలయం లో, మధిర నియోజకవర్గ కేంద్రంలో నీ శివాలయం లో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శివరాత్రి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, రాహుల్ గాంధీ,తండ్రి రాజీవ్ గాంధీ కుటుంబం పేరిట దేవాలయాల్లో పూజలు చేయించారు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వానికి శివపార్వతుల ఆశీస్సులు ఉండాలని ఆయన పూజలు నిర్వహించారు. స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో శివపార్వతుల పూజ అనంతరం జాతరలో ఏర్పాటుచేసిన దుకాణాల్లో చిన్ననాటి మిత్రులతో కలిసి కలియతిరిగారు .మిఠాయిలు కొనుగోలు చేసి మిత్రులకు పంచుతూ ఆనందంగా గడిపారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇదేమి నిర్లక్ష్యం.. ఎలక్షన్ కోడ్‌కు తూట్లు..



**కారేపల్లి ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** మండలంలో ఎన్నికల కోడ్ సరిగా అమలు కావడంలేదు. అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. గురువారం జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రానికి కూతవేటు దూరంలో అధికార పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలు ప్రధాన రహదారిపై దర్శనమిస్తున్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మండల కేంద్రంలో రాజకీయ పార్టీల నాయకల ఫ్లెక్సీలు ఉంచకపోవడం పట్ల అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల కోడ్‌ను అమలు చేయాల్సిన సిబ్బందికి ఇవేమీ పట్టడంలేదు. నిబంధనల ప్రకారం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటల్లో సంబంధిత అధికారులు రాజకీయ పరమైన ఫ్లెక్సీలను తొలగించాలి. ఇవి చూసిన వివిధ పార్టీల నాయకులు ఎన్నికల కోడ్ అధికార పార్టీకి పట్టవా అంటూ బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. కోడ్ ను అధికారులు ఎందుకు అమలు చేయడం లేదని విమర్శిస్తున్నారు.

## నేను బీఆర్ఎస్ లోనే ఉన్నా..!

**- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి**




FIRST INFORMATION REPORT

**గద్వాల,ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** తను బీ ఆర్ ఎస్ పార్టీలో ఉన్నట్లు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. నాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని చర్యలు తీసుకోవాలి పోలీసులకు ఎమ్మెల్యే బండా కృష్ణమోహన్ రెడ్డి ఫిర్యాదు చేశారు. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ పేరుతో ఫ్లెక్సీలు వేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉద్దేశపూర్వకంగానే తనను అప్రతిష్ట పాలు చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

## జోగులాంబ గద్వాల జిల్లాలో నకిలీ సర్టిఫికెట్ల సూత్రధారి అరెస్ట్



**గద్వాల,ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** జోగులాంబ గద్వాల జిల్లాలోనకిలీ సర్టిఫికెట్ల సూత్రధారి మిర్యాలగూడకు చెందిన మాజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు గద్వాల పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఇంకా నకిలీ సర్టిఫికెట్లు వ్యవహారం విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతని నుంచి ఇంటర్మీడియట్ బిసిఏ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ మొగులయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మొగులయ్య,గద్వాల సర్కిల్ ఇన్స్పెక్టర్ టంగుటూరి శ్రీను, గద్వాల పట్టణ ఎస్సై కళ్యాణ్ రావు పాల్గొన్నారు.

## కొండాపూర్ పోలింగ్ కేంద్రంలో పాము



**కొండాపూర్ ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కొండాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. నేపథ్యంలో పోలింగ్ కేంద్రంలో బుధవారం రాత్రి ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామగ్రిని తీసుకొని పోలింగ్ కేంద్రానికి వచ్చారు. కేంద్రంలో నాగుపాము రావడంతో స్థానికులు దాన్ని చంపేశారు. దీంతో కేంద్రాల్లో లైట్లు ఏర్పాటు చేయాలని ఎన్నికల సిబ్బంది కోరుతున్నారు.

# హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో అరుదైన మరకత శివలింగం..ఈ ఆలయ విశిష్టత తెలుసా!




- మహిమాన్విత మరకతలింగం

**శంకర్ పల్లి ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** భక్తులను అనుగ్రహించడానికి పరమేశ్వరుడు ద్వాదశ జ్యోతిర్లింగ రూపాల్లో వెలిశాడు. ఈ క్షేత్రాల్లో మహారాష్ట్రలోని పర్లి ప్రత్యేకమైంది. ఇక్కడ వైద్యనాథేశ్వరుడిగా కొలువుదీరి ఆయురారోగ్యాలను అనుగ్రహిస్తున్నాడు శివుడు. పర్లి వైద్యనాథుడిని పోలిన బ్రహ్మసూత్రం కలిగిన మరకత శివలింగం రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి సమీపంలోని చందిప్ప గ్రామంలో ఉంది. శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ మరకత సోమేశ్వర లింగాన్ని సేవిస్తే వ్యాధులు పోతాయని, సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. చందిప్ప మరకత సోమప్ప విశేషాలెన్నో. శివలింగం.. పార్థివ లింగం, స్ఫటిక లింగం, సైకత లింగం ఇలా వివిధ రూపాల్లో దర్శనమిస్తుంది. అందులోనూ మరకత లింగం ముదురు ఆకుపచ్చ రంగులో మెరిసిపోతూ ఉంటుంది. అరుదైన ఆ మరకత లింగం కొలువై ఉన్న చందిప్ప క్షేత్రానికి శతాబ్దాల చరిత్ర ఉంది. ముచుకుంద నది ఒడ్డున ఉందీ క్షేత్రం. క్రీస్తు శకం 1076-1126 మధ్య పశ్చిమ చాళుక్య రాజు ఆరో విక్రమాదిత్యుడు ఈ లింగాన్ని ప్రతిష్ఠించాడని శాసనం ద్వారా తెలుస్తున్నది. క్రీ.శ.1101 సంవత్సరం కార్తిక శుద్ధ పంచమి.. గురువారం నాడు ప్రతిష్ఠ ఉత్సవం జరిగిందని అదే శాసనంలో స్పష్టంగా లిఖించారు. దాదాపు 920 ఏండ్ల చరిత్ర ఉన్న ఈ



పురాతన శివాలయం కాలవరీక్షకంలో నైశిథిలవ్వైపోయింది. పదిహేనేండ్ల కిందట కొందరు భక్తులు పూనుకొని పునరుద్ధరించారు. నూతన గర్భాలయాన్ని నిర్మించారు.

**ఆరోగ్య పదాత**

పర్లిలోని వైద్యనాథ జ్యోతిర్లింగానికి, చందిప్ప మరకత లింగానికి చాలా పోలికలు ఉన్నాయని చెబుతారు పండితులు. చందిప్ప శివయ్యను పూజిస్తే పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. అసలే శివుడు అభిషేక ప్రియుడు. ఐదు సోమవారాలు కానీ, ఐదు పౌర్ణములు కానీ, ఐదు మాస శివరాత్రులు కానీ మరకత లింగాన్ని అర్చిస్తే సకల కోరికలూ నెరవేరుతాయని విశ్వాసం. పౌర్ణమినాడు లింగాభిషేకం చేసిన జలాలతో స్నానం చేసిన వారికి వైకుంఠప్రాప్తి తథ్యమని చెబుతారు. అంతేకాదు బ్రాహ్మీ ముహూర్తంలో.. అభిషేకిస్తే పరమశివుడి కటాక్షం లభిస్తుందని స్థానిక ఐతిహ్యం.

**భైరవం.. క్షేత్రపాలం**

ఈ ఆలయానికి కాలభైరవుడు క్షేత్ర పాలకుడు. ఆలయ ప్రాంగణంలో వెలిసిన కాలభైరవుడు ఆవరణను వెయ్యి కండ్లతో రక్షిస్తూ ఉంటాడని చెబుతారు. ఆదివారం కాలభైరవుడిని పూజిస్తే సమస్త గ్రహదోషాలూ తొలగిపోతాయని స్థల పురాణం. అంతేకాదు శివుడి కుమారుడైన సుబ్రహ్మణ్యస్వామి ఇక్కడ నాగుపాము రూపంలో సంచరిస్తూ ఉంటాడని ప్రతీతి. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఈ ఆలయం కొన్నేండ్ల కిందటి వరకూ నిరాదరణకు గురైంది. పండుగలప్పుడు తప్ప భక్తులు వచ్చేవారు కాదు. 2007లో శివరాత్రి సందర్భంగా ఒక భక్తుడు ఆలయంలో అభిషేకం చేశాడు. అప్పుడు శివలింగంపై ప్రసరించిన సూర్యకిరణాలు పరావర్తనం చెందడంతో దానిని మరకత లింగంగా గుర్తించాడు. తర్వాత చందిప్ప చరిత్ర తెలుసుకొని భక్తుల సహకారంతో ఆలయాన్ని పునరుద్ధరించాడు. శ్రావణం, కార్తిక మాసాల్లో ఇక్కడ విశేష పూజలు జరుగుతాయి. శివరాత్రి ఘనంగా నిర్వహిస్తారు. హైదరాబాద్ వాసులు వారాంతంలో వెళ్లిరావడానికి అనువైన క్షేత్రమిది. మానసిక ఒత్తిళ్లతో కూడిన జీవితంలో ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శన మనోబలాన్ని ప్రసాదిస్తుంది.

**ఎలా వెళ్లాలి?**

చందిప్ప క్షేత్రం హైదరాబాద్‌కు 48 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది . శంకర్‌పల్లి వరకు బస్సులో వెళ్లాలి. అక్కడి నుంచి చందిప్పకు ఆటోలు ఉంటాయి.

**దేవుడి మాన్యాలు**

చందిప్ప ఆలయానికి విక్రమాదిత్యుడి కాలంలోనే వందలాది ఎకరాలు మాన్యాలుగా సమర్పించినట్టు ఇక్కడి శాసనం తెలియజేస్తున్నది. ఆలయ నిర్వహణ, విశేష పూజలు, శివరాత్రి వంటి ఉత్సవాల నిర్వహణకు దాదాపు 254 ఎకరాలు కేటాయించినట్లు అందులో ఉన్నది. ఆలయానికి పశ్చిమ దిశలో 153 ఎకరాలు, తూర్పు దిశలో 2.20 ఎకరాలు, వరి పంట, పూలతోట కోసమని 54 ఎకరాలు, ఆలయ అర్చకులకు, నిత్యాన్నదానం కోసం మరిన్ని ఎకరాలు.. ఇలా అపారమైన మాన్యాలు ఉన్నాయని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

## అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి జాతరను ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

-ఏడుపాయల వన దుర్గమ్మ జాతర షురూ...


**పాపన్నపేట, ఫిబ్రవరి 26(ప్రజాక్షేత్రం):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మంజీరా నది తీరాన వెలిసిన ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గమ్మ క్షేత్రం లో జరిగే మూడు రోజుల జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి జాతర ఉత్సవాలను లంచానంగా ప్రారంభం చేసారు. ఈ సందర్భంగా దేవాలయం కు చేరుకున్న మంత్రి మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది అతిథి మర్యాదలతో అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. సాంప్రదాయ బద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏడుపాయల వన దుర్గమ్మ దేవాలయం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలను ఈ సంవత్సరం ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్ల రూపాయల నిధులను కేటాయించిందని మంత్రి వెల్లడించారు. అమ్మవారి



దర్శనానికి వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. జిల్లాకు చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులతో పాటు దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యం కోసం తాత్కాలిక ఆసుపత్రి తో పాటు 10 వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 25 మంది డాక్టర్లు, 256 మంది సిబ్బంది , అత్యవసర పరిస్థితిలో సేవలు అందించేందుకు నాలుగు అంబులెన్స్ లను సిద్ధంగా ఉంచామన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో, పాడి పంటలతో, శాంతి సౌభాగ్యాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు మంత్రి తెలిపారు.

## 50వేల రూపాయల ఎల్ఓసి లెటర్ ను అందజేసిన ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి



గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు గద్వాల మండలం గోనుపాడు గ్రామనికి చెందిన కిస్మత్ కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 50,000 రూపాయలు ఎల్ఓసి లెటర్ ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి చేతుల మీదుగా అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా చైర్మన్ ఎంఎ సుభాన్, సీనియర్ నాయకులు ప్రభాకర్ గౌడ్, కురుమన్న, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## శివ స్వాములకు పండ్ల పంపిణీ



శ్రీ మహాశివరాత్రి పర్వదినము సందర్భంగా మాల ధారణ చేసి దీక్ష చేపట్టిన శివ స్వాములకు మరియు శివరాత్రి ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులకు దేవరకద్ర మండల పరిధిలోని మరము నందు శివాలయములో బుధవారం రోజు అడవి అజిలాపురం గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ గౌడ్ రాణీ దంపతులు పండ్లను పంపిణీ చేశారు . ఈ సందర్భంగా శివ స్వాములు భక్తులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## వైభవంగా మహాశివరాత్రి ఉత్సవములు



మహాశివరాత్రి సందర్భంగా దేవరకద్ర మండల కేంద్రంలో ఉన్న శివాలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో పూలహారాలతో అలంకరించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారము తెల్లవారుజాము నుంచి అర్చకులు శివునికి పంచామృతాభిషేకాలతో పల పుష్పాలతో పూజలు నిర్వహించారు. భక్తులు మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే గుడి బావి దగ్గర స అతి పురాతనమైన శివాలయములో స్వయంభుగా వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామికి పంచామృత స్నానాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గిరిజా కళ్యాణం ఉత్సవాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే రాత్రికి భజన కార్యక్రమం నిర్వహించి గురువారము రోజు ఉదయము స్వామివారికి పల పంచామృతాలతో అభిషేకం , అన్నాభిషేకం నిర్వహించి తదానంతరము భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమము ఉంటుందని కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ నిర్వహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సంజీవ చారి , నాగరాజు, నాగభూషణం ,మాజీ జెడ్పిటిసి లక్ష్మీకాంత్ రెడ్డి , ఎల్ఐసి ఆంజనేయులు , నందకిషోర్ , జగన్మోహన్ రెడ్డి, మున్నూరు ప్రతాపులు, మున్నూరు బాలరాజ్, కిరణ్ కుమార్ రెడ్డి , నిరంజన్ , నాగేశం శెట్టి మహిళలు యువకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆరేపల్లి గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు

వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం ఆరేపల్లి గ్రామంలో స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు వేసవిలో ప్రజలకు దాహార్తిని తీర్చడానికి బస్టాండ్ ఆవరణలో స్వామి వివేకానంద స్ఫూర్తితో చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు సేవా సమితి సభ్యులు తెలిపారు గ్రామస్తులతో పాటు వివిధ పనులపై గ్రామానికి వచ్చే ప్రజలకు చలివేంద్రం ఉపయోగంగా ఉంటుందని తెలిపారు.

## పరమశివుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

-బి.యాదయ్య రాఘవేంద్రమ్మ దంపతులు




మహబూబ్ నగర్ జిల్లా పట్టణ కేంద్రంలో పాలమూరు నియోజకవర్గం మున్సిపాలిటీలో బండ్ల గెరి శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి వారి పుణ్యక్షేత్రంలో శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామిని మహాశివరాత్రి సందర్భంగా బి యాదయ్య రాఘవేంద్రమ్మ దంపతులు స్వామివారిని అభిషేక పూజలు చేసి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా శివలింగానికి అభిషేకం,అర్చన పూజలు చేశారు.అనంతరం వేద పండితులు వారిని ఆశీర్వదించారు.ఈ సందర్భంగా పాలమూరు నియోజకవర్గం ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని,పాడి పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. బండ్ల గిరి శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి పేర్కొన్నారు.ఈ మహాశివరాత్రి దర్శనంలో వివిధ సీనియర్ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం కార్పొరేట్ క్వాలిటీ జియం గా మేకల కనకయ్య

-ఘనంగా సన్మానించిన1979-80 బ్యాచ్ పూర్వా విద్యార్థులు



కొత్తగూడెం కూలీలైన్ హై స్కూల్ 1979 ,1980 టెన్త్ క్లాస్ బ్యాచ్ పూర్వ విద్యార్థులలో మేకల కనకయ్య క్వాలిటీ జనరల్ మేనేజర్ గా సింగరేణి నందు ప్రమోషన్ తీసుకున్న సందర్భంగా వారిని ఘనంగా సత్కరించిన పూర్వ విద్యార్థులు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తోటి స్నేహితుడు ఎంత గొప్ప స్థాయికి ఎదగడం మాకు చాలా సంతోషంగా ఉందని ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని వారిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించిన పూర్వ విద్యార్థులు. ఈ సందర్భంగా సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా క్వాలిటీ జిఎం మేకల కనకయ్య జ్యోతి దంపతులను వారి నివాసం రైటర్ బస్తీలో వారికి బొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించిన పూర్వా విద్యార్థులు.ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య వెంకటేశ్వర్లు బాలిశెట్టి సుందర్ రాజు, సత్యనారాయణ సూర్యనారాయణ శంకర్ నారాయణ గాజసలావుద్దీన్ రవి డాంగే ఇబ్రహీం మిత్రులు తదితరులు పాల్గొనినారు

## గోశాలలో ఉచిత వైద్య శిబిరం



ఐ టి సి బంగారు భవిష్యత్ ప్రోగ్రాం ద్వారా బైఫ్ స్వచ్ఛంద సంస్థ మంగళవారం రోజున భద్రాచలం రామాలయం గోశాలలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు.

డా.వలి బాబా ఆధ్వర్యంలో గోశాలలోని ఆవులలో ఆరోగ్యం , సూడి నిలువని పశువులని గుర్తించి 24 అవులకు గర్భకోశ వ్యాధులకు, సామాన్య వ్యాధులకు చికిత్సలు అందించారు. 28 దూడలకు నట్టలనివారణ మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ బంగారుభవిష్యత్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ గీతప్రవళిక, శ్రీనివాస రెడ్డి రామాలయం సీనియర్ అసిస్టెంట్, సైదయ్య బైఫ్ సంస్థ క్షేత్ర అధికారి, హరినాథ్, ఆనంద్ లు పాల్గొన్నారు.